
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 8 మార్చి 2025

ఆశావహ దృక్పథంతో ముందుకు ఉరకండి



జనాభాలోనైనా, జయపజయాలను శాసించడంలోనైనా మహిళలే కీలకపాత్ర. సంఖ్యాబలంలోనే కాదు.. అన్ని రంగాల్లోనూ మహిళలు అగ్రగామిగా నిలవాలి. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని అందనంత ఎత్తుకు ఎదగాలి. అవమానాలకు కుంగిపోవద్దు. ప్రతి ఒక్కరి జీవితాల్లో కష్టనష్టాలు సహజం. మహిళల విషయంలో ఇవి మరీ అధికం. అయినా వాటిని ఆత్మవిశ్వాసంతో జయించాలి. పట్టుదలతో ముందుకు కదిలితే మన జీవితంలో ప్రతి రోజు ఒక మహిళా దినోత్సవమే. విద్య, వృత్తి, వ్యాపారాల్లోనే కాదు, రాజకీయంగా కూడా మహిళలు చైతన్యవంతులు కావాలి. జీవితంలో ఎదురయ్యే ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ, కుటుంబ పోషణకు, సమాజంలో గౌరవప్రదంగా జీవించడానికి అహర్నిశలు శ్రమిస్తున్న నా తోటి మహిళామణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఆకాశం మన హద్దు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నా భర్త ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిల సహకారంతో ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నా. ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయి. వాటిని అందుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు కదలండి.


- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

మార్పు.. ఇంట్లోనే మొదలవ్వాలి!

మహిళలకు సమాన హక్కులు ఇవ్వడం వేరు. ఆచరించడం వేరు. సమాన హక్కులు అనేది ఆచరణపూర్వకంగా జరిగిన నాడు నిజమైన మహిళా సాధికారత సాకారమవుతుంది. చట్టబద్ధంగా సమానహక్కులు కల్పిస్తున్నా ఆచరణలో అనేక రంగాలలో మహిళలు కేవలం ఉత్సవ మూర్తులుగా ఉంటుండగా వారి అధికారాలను కుటుంబసభ్యులైన పురుషులే అనుభవిస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితులు మారుతుండటం శుభపరిణామం. అయితే మహిళలకు హక్కులు ఇవ్వటం అనేది ఇంటినుంచి ప్రారంభమైన నాడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ఇంట్లో మహిళలను కేవలం గృహిణులుగానే చూడటం, ఆడపిల్లలకు స్వేచ్ఛ లేకుండా తల్లిదండ్రులు తమ అభీష్టం మేరకు వారిని పెంచటం కాకుండా అమ్మాయిలకు కూడా చిన్ననాటి నుంచే ఓ లక్ష్యం దిశగా ప్రోత్సహించాలి. వారికి కూడా పెద్దపెద్ద గోల్స్ నిర్దేశించి లక్ష్యసాధన దిశగా వారు స్వతంత్రంగా ప్రయత్నించేలా ప్రోత్సహిస్తే అప్పుడు అన్నిరంగాలలోను మహిళలు అద్భుతాలు చూపించగలుగుతారు. మా ఇంట్లో నన్ను అలా ప్రోత్సహించారు కనుకనే నేడు సబ్ కలెక్టరుగా మీముందు ఉండగలిగాను.



- తిరుమణి శ్రీపూజ, కందుకూరు సబ్ కలెక్టరు



● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మగువా!

అన్నిరంగాల్లోనూ రాణిస్తున్న మహిళాలోకం

అటు కుటుంబం, ఇటు ఉద్యోగ బాధ్యతల్లో సఫలం

'ఏదైనా చెప్పాలనుకుంటే మగవాళ్లకు చెప్పండి.. ఏదైనా చేయాలనుకుంటే మాత్రం ఆడవాళ్లను అడగండి..' అని ప్రపంచ మేధావులు కీర్తించారంటే మానవ జీవితంలో మహిళల పాత్ర ఏపాటిదో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేశానికి రాజైనా ఓ తల్లికి బిడ్డేగా.. అన్న మాటలు అమ్మ గొప్పతనాన్ని ఎల్లప్పుడూ స్తుతిస్తూనే ఉంటాయి. మహిళ లేని ఇంటిని ఊహించడం చాలా కష్టం అనేంతగా పరిస్థితులు మారిపోయాయి. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేదు. ప్రపంచంలో పురుషులు చేసే ప్రతి పనిని మహిళలు చేయగలిగే స్థాయికి చేరుకు న్నారు. తెగువ, గొప్పదనంలో సింహపురి మగువలు కూడా ముందు నిలస్తుండటం విశేషం. మహిళాలోకం కదంతొక్కిన సారా ఉద్యమాన్ని గుర్తుచేసుకోవడం సందర్భోచితం. ఎంతోమంది నారీమణులు రాజకీయాల్లో ఉన్నత స్థానాల్లో రాణించారు.. రాణిస్తున్నారు. ఉన్నత ఉద్యోగాల్లో కూడా తమ ప్రతిభను చాటుకుంటున్నారు. వ్యాపార సామ్రాజ్యంలో కూడా జిల్లా మహిళల పాత్ర తక్కువేమీ కాదు. ఓ వైపు కుటుంబం, మరో వైపు ఉద్యోగ, వ్యాపార బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఇటీవల మహిళల ప్రాధాన్యత జిల్లాలో క్రమేణా పెరుగుతుండడం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా పాలనలో అనేక మంది మహిళలు కీలకంగా వ్యవహరిస్తుండటమే ఇందుకు నిదర్శనం. జిల్లా జడ్జి, అదనపు ఎస్పీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కందుకూరు సబ్ కలెక్టర్, నెల్లూరు నగర డీఎస్పీ, డీఎంహెచ్‌వో, జడ్పీ సీఈవో, ఆత్మకూరు, నెల్లూరు ఆర్డీవోలు.. ఇలా అనేక ఉన్నత స్థానాల్లో మహిళామణులు తమ ప్రతిభను చాటుకుంటు న్నారు. ఇక జిల్లాలో ఓటర్ల సంఖ్య 19.44 లక్షలు ఉండగా, ఇందులో పురుషులు 9.51 లక్షలు ఉండగా, మహిళలు 9.93 లక్షలు ఉన్నారు. అంటే పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్ల సంఖ్య 42 వేలు అధికం కావడం విశేషం. జిల్లాలో మొదట నుంచీ మహిళలంటే గౌరవం ఎక్కువగా ఉందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. అదేవిధంగా అక్షరాస్యత విషయంలో కూడా పురుషులతో సమానంగా మహిళలు ఉన్నారు. మహిళలకు పెరుగుతున్న ప్రాముఖ్యత దృష్ట్యా ప్రభుత్వాలు కూడా వారికి పెద్ద పీట వేస్తున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వాలను శాసిస్తున్నది మహిళా లోకమే అంటే అతిశయోక్తి కాదు. ఈ కారణంతోనే మహిళలకు అనేక పథకాలను ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తుండగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయబోతోంది. త్వరలోనే బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమల్లోకి తీసుకురాబోతోంది. అలానే పేదలకు మంజూరు చేసే ఇంటి పట్టా నుంచి రేషన్ కార్డు వరకూ ప్రతీ ఒక్కదాన్నీ మహిళ పేరుతోనే మంజూరు చేస్తుండడం సమాజంలో మహిళల ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

> నెల్లూరు (సాంస్కృతికం) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు శనివారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరగనున్నాయని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మహిళలను, పొదుపు సంఘాల మహిళలను సత్కరించడంతోపాటు బ్యాంకు లింకేజీ రుణాలు, వివిధ పథకాల కింద ఆస్తుల పంపిణీ, ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు తెలిపారు.

కస్తూర్బాలో నేడు ..

వైద్య విద్యలో 'బంగార'ం!

ఆత్మకూరు విద్యార్థినికి బంగారు పతకం



ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీలోని వెంకట్రావుపల్లికి చెందిన వైద్య విద్యార్థిని పందల విరాజిత ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. కడపలోని రిమ్స్‌లో జనరల్ మెడిసిన్ చదువుతూ ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షలలో 76.8 శాతం మార్కులతో విరాజిత ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమె తండ్రి రాఘవరెడ్డి ఆత్మకూరు మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, తల్లి వైవి స్వరాజ్యలక్ష్మి సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు. ఇక్కడే ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న విరాజిత ఎంబీబీఎస్‌ను భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో అభ్యసించింది. ఈక్రమంలో జనరల్ మెడిసిన్‌లో బంగారు పతకం సాధించిన డాక్టర్ విరాజితను రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి యాదవేంద్రరెడ్డి అభినందించారు.

అవకాశం కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు



అవకాశాలు కలిగితే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు. ఇందుకు కుటుంబాల ప్రోత్సాహం ఎంతో అవసరం. లింగ వివక్ష లేని సమాజం కోసం తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. చదువుపై ఉన్న శ్రద్ధ, సమాజానికి సేవ చేయాలన్న పట్టుదల, కుటుంబాల ప్రోత్సాహంతోనే ఈ హోదాకి ఎదిగాను. టెన్త్ చదివేటప్పుడే నాకు వివాహమైనా పట్టుదలతో చదివి డబుల్ పీజీ చేసి అంచలంచెలుగా ఎదుగుతూ ఈ హోదాకు వచ్చాను. ఓర్పుతో నిజాయతీగా, నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తిస్తే అన్నిటినీ అధిగమించడంతోపాటు మన గురించి మన పని తీరే మాట్లాడిస్తుంది. నేను ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సమానంగా చూస్తాను. నాకున్న ఒక్కగానొక్క కొడుకు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నా. ఇప్పుడు అతను హిందూపురంలో డీఎస్పీగా పని చేస్తున్నాడు. చట్టసభలోనూ మహిళలకు ప్రాతినిధ్యం పెరగాలి. సమాజ సేవ కోసం ప్రతి మహిళ ముందుకు వచ్చి మరింత బాధ్యతగా పని చేయాలి.

- జడ్పీ సీఈవో విద్యారమ



నగరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వైద్య ఆరోగ్య శాఖలో ప్రత్యేక గుర్తింపు

వైద్య ఆరోగ్య శాఖలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది కూడా ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. పురుషులతో పోటీగా మహిళలు తమ వృత్తుల పట్ల అంకిత భావంతో పని చేస్తున్నారు. ప్రత్యేకించి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వలంటీర్లు వైద్యసేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది శుభపరిణామం. అనేక వ్యాధులను నివారించబంలో మహిళలు అందిస్తున్న సేవలు ఆదర్శనీయం.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



రైతుల్లారా.. మద్దతు ధర పొందండి!

- తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు
- కొనుగోళ్లకు 300 కేంద్రాల ఏర్పాటు
- 48 గంటల్లో డబ్బులు జమ చేస్తున్న ప్రభుత్వం
- రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై చర్యలు
- జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

నెల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల్లారా.. ఎవరూ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు. మీకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించేందుకు జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. మీకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. ఎటువంటి అపోహలు లేకుండా మీరు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మీ కష్టానికి ఫలితం పొందండి' అంటూ కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మా ట్లాడారు. జిల్లాలో 11 లక్షల మెట్రి క్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రైతుకు కనీస మద్దతు ధర కల్పిం చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. అందులో భాగంగా 300 కేంద్రాల ఏర్పాటుతో పాటు లక్ష గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచాం. రానున్న రోజుల్లో మరిన్ని బ్యాగు లను అందు బాటులోకి తీసు కొస్తాం. జిల్లాలో ఉన్న 105 మిల్లుల నుంచి రూ.20 కోట్ల బ్యాంకు గ్యారెంటీలు తీసుకున్నాం. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం తీసుకోవాలని మిల్లర్లకు సూచించాం. ఎక్క డైనా ఫిర్యాదులు వస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే ప్రభుత్వం రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దు' అంటూ కలెక్టర్ సూచించారు.

ధాన్యం నిల్వ కోసం

ఒకవేళ రైతులు ధాన్యం నిల్వ చేసుకోవాలంటే జిల్లాలో 40 చోట్ల సహకార శాఖ గోదాములు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితోపాటు అవసరమైతే మార్కెటింగ్ యార్డులను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి కేంద్రంలో అధికా రులకు బాధ్యతలు అప్పగిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. తేమ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని మిల్లర్లకు సూచించామని, కొంచెం అటుఇటు ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని ఆనంద్ చెప్పారు. అనంతరం మిల్లర్లతో కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ సమావేశ మయ్యారు.



చికెన్ వంటకాల మేళాకు తరలివచ్చిన జనం



చికెన్ తింటున్న కలెక్టర్, జేసీ

కోళ్లకు వ్యాధుల్లేవ్.. ఆరగించేయండి!

- కోళ్ల పెంపకానికి సబ్సిడీ రుణాలిస్తాం
- చికెన్ మేళాలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోళ్లకు ఎలాంటి వ్యాధులు లేవని, మంచి పోషక విలువలు కలిగిని చికెన్‌ను అందరూ తినాలని కలెక్టర్ ఆనంద్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జిల్లా పశుసంవర్ధక శాఖ, నేషనల్ ఎగ్, పౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్, జిల్లా పౌల్ట్రీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన, చికెన్ వంటకాల మేళాను జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో 40 శాతం కోళ్ల పెంపకం పడిపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. కోళ్ల పెంపకానికి రైతులు ముందుకు వస్తే ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తామమన్నారు. జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ కేసు నమోదు కాలేదని, ఎక్కడైనా ఆ లక్షణాలు కనిపిస్తే రెడ్‌జోన్‌గా ప్రకటించి అది విస్తరించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎగ్ ట్రేడర్స్, చికెన్ బ్రీడర్స్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అనంతరం అందరితో కలిసి చికెన్ వంటకాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్, డీడీలు సోమయ్య, పీవీ.సురేష్, నాగమణి, పౌల్ట్రీ అసోసియేషన్ నిర్వాహకులు, ప్రముఖులు రమేష్‌బాబు, గోపాలకృష్ణ, ప్రణీత్, వెంకటరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, ఆదినారాయణ, రాఘవరావు, బలరామనాయుడు, కృష్ణారెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

- బిలకూట క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు
- విజయవంతానికి కృషి చేద్దాం
- కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి పిలుపు

బిట్రగుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బిలకూట క్షేత్రంలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీన ప్రారంభం కానున్నాయి. 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కావలి ఎమ్మెల్యే దుగమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎస్సై బోజ్యా స్వామి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ రకాల సేవలు సకాలంలే జరిగేలా చూస్తామని తెలిపారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రవాస భారతీయులు, అమరాబచ్చు ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్, సంధ్య దంపతులు ఆలయ కార్యనిర్వాహణ, అన్నదాన సదన్ భవనాలు నిర్మించారని తెలిపారు. వీరే రూ.2 కోట్లతో పడమర రాజగోపురం నిర్మించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, పాలక మండలి మాజీ చైర్మన్ మాల్యాద్రి, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, పద్మారెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, రంగయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై ఈవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

నేడు జడ్పీ సమావేశం

- వాయిదా పడే అవకాశం?

నెల్లూరు (జడ్పీ), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం ఆరుణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, డ్వామా, జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖలతోపాటు 2025-26 ఏడాది బడ్జెట్‌పైనా చర్చించి ఆమోదిచేలా అజెండాను రూపొందించారు. అయితే శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఎక్కువగా ఆయా కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉంది. దీంతో జడ్పీ సమావేశానికి సభ్యులు పెద్దగా హాజరయ్యే అవకాశం కనబడటం లేదు. సభకు హాజరయ్యే సభ్యుల కోరంను బట్టి సమావేశాన్ని వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూ డివిజన్‌గా ఉదయగిరి

- అసెంబ్లీలో మంత్రి అనగాని వెల్లడి

ఉదయగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా మార్చేందుకు పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం అసెంబ్లీలో వెల్లడించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే ఉదయగిరి పెద్దది. ఇక్కడ రెవెన్యూ పరంగా రైతులు, ప్రజలు అనేక సమ స్యలు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రజలకు సమస్యలు తీరుతాయనే ఆలోచనతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రతి సమావేశంలో మాట్లాడటమేగాక, అధికారుల ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో మంత్రి అనగాని ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ ప్రస్తావన తీసుకురావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక నియోజకవర్గం.. 3 డివిజన్లు

ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. సీతారామపురం, ఉదయగిరి మండలాలు ఆత్మకూరు డివిజన్, వరికుంటపాడు, కొండాపురం మండలాలు కందుకూరులోనూ, దుత్తలూరు, వింజ మూరు, కలిగిరి, జలదంకి మండలాలు కావలి రెవెన్యూ డివిజన్‌లలో ఉన్నాయి. ఆయా మండలాల్లో రైతులు, ప్రజలు వివిధ సమస్యలపై డివిజన్ కేంద్రాలకు వెళ్లా లంటే అవస్థలు పడుతున్నారు. అందులో భాగంగానే ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలని మంత్రితో పాటు ప్రభుత్వానికి ఎమ్మెల్యే విన్నవించారు. ప్రభుత్వం అందుకుతగ్గట్టుగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే భూ, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి శాశ్వత మార్గం చూపినట్లవుతోంది.



సత్కారం..

అంనతసాగరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దారు సుభాషిణి, సీడీపీవో పద్మావతి తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

పట్టుదలతో శ్రమిస్తేనే విజయం



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగాలి. పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యం. కడప జిల్లా మైదుకూరు మాది. నాన్న భూమిరెడ్డి గంగయ్య, అమ్మ లక్ష్మి. వ్యవసాయ కుటుంబం మాది. బీటెక్ పూర్తి చేసి గ్రూప్స్‌లో మొదటి ప్రయత్నంలో విఫలమైనా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రెండోసారి గ్రూప్-1లో రెండో ర్యాంకు సాధించాను. మొదటిసారి ఆత్మకూరు ఆర్డీవోగా బ్యాతలు చేపట్టాను. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా. సక్సెస్ కావాలంటే అదృష్టాన్ని నమ్ముకో కుండా కష్టాన్ని నమ్ముకోవాలి. అనుకున్నది సాధించాలన్న పట్టు దల ఉంటే ఏదీ కష్టం కాదు. అది ఒక సాధన మార్గం మాత్రమే అవుతుంది. ఓటమి సమయంలో నేను అంతర్మధ నానికి గురయ్యాను. కానీ ఆత్మ విశ్వాసం, కుటుంబసభ్యుల తోడ్పాటు ఊరటగా నిలిచాయి.

- బి పావని, ఆర్డీవో, ఆత్మకూరు



అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విద్య, ఉపాధి మహిళల హక్కు

'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ కన్న కలలు నిజం కావాలంటే ప్రతి మహిళ ఉన్నత విద్యను అభ్యసించి, తమ కాళ్లపై తాము నిలబడేలా ఉద్యోగం చేయాలి. మాది వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు. నాన్న ఖలీల్‌బాషా ఆర్టీసీలో ఉద్యోగి. అమ్మ ఖాజాబీ. చిన్నతనం నుంచే ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించే వారు. మైదుకూరులో డిగ్రీ వరకు చదువుకుని తిరుపతిలో ఎంబీఏ పూర్తి చేశాను. ఆ తర్వాత కర్ణాటకకు చెందిన మోహన్ సుబ్రహ్మణ్యంను మా కుటుంబసభ్యుల అంగీకారంతో వివాహం చేసుకున్నా. అప్పటి నుంచి భర్త సహకారంతో గ్రూప్స్‌కు శిక్షణ పొందాను. 2018లో గ్రూప్-1లో రాణించి ఏఈఎస్‌గా ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం సంపాదించాను. మొదటి పోస్టింగ్ ఏలూరులో విధులు నిర్వహించి అంచెలంచెలుగా పదోన్నతి పొంది ఇప్పుడు నెల్లూరు ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా పని చేస్తున్నా.

- ఆయేషా బేగం, నెల్లూరు ఐఎంఎల్ డిపో మేనేజర్



భర్త, కుమార్తెతో ఆయేషా బేగం (ఫైల్)

● ఆత్మకూరు: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం సీడీపీవో సునీలత ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు జరిగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వాలు విద్య, పౌష్టికాహారం, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, పెన్షన్ తదితర సౌకర్యాలతో పాటు రిజర్వేషన్ సౌకర్యం, రక్షణ చట్టాను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం ఆమెను అంగన్‌వాడీ కార్యర్తలు, ఆయాలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు

ఏఎస్ పేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గుంపార్లపాడు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహానికి శుక్రవారం పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆఫీస్ సబార్డినేట్ నారాయణమ్మ, ఆయా చిన్నమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకులు కృష్ణవేణి, పద్మమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వి పోతులూరయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ఉదయగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 17వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, సెయింట్ మేరీస్, హోలీ ఏంజెల్స్, మండలంలోని గండిపాళెం గురుకుల, జడ్పీ ఉన్నత పాఠశాలల కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. అలాగే ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి శకునాపల్లి, పుల్లాయపల్లి పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, పీవీ రత్నం, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

మేకపాటి వెంకురెడ్డి మెమోరి యల్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో పరీక్షల్లో ఏవిధంగా మంచి ఫలితాలు సాధించాలనే అంశంపై మోటివేషనల్ స్పీకర్లు రత్నశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలు పదో తరగతి విద్యార్థులకు వివరిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటల పరిశీలన

ఉదయగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పొలంబడి, ఇండిగ్యాప్ ధ్రువీకరణ కోసం శుక్రవారం అధికారులు పంటల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు వరి, శనగ పంటలను పరిశీలించారు. ఈకార్య క్రమంలో ఏడీఏ చెన్నారెడ్డి, ఏవో ఆంజనేయుల నాయక్, ఎక్స్‌టర్నల్ ఇన్ స్పెక్షన్ అధికారి సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

మామిడి రైతులు పూత దశలో తగు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన శాఖాధికారిణి జయశ్రీ సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పసముద్రం రైతుసేవా కేంద్రంలో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటలో తామరపురుగు ఆశించే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో పండ్లతోటలకు నీటిఎద్దడి తలెత్తకుండా తోటల్లో ఫారం పాండ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు

అనంతసాగరం మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, అనంతసాగరం, ఉప్పలపాడు, ఆమనిచిరివేళ్ల, ముస్తాపురం, గౌరవరం గ్రామాల్లో రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

సోమశిలలో 57.088 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 57.088 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 1,450, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర : ఎంపీడీవో



సంగం : రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో షాలెట్ సూచించారు. శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు ఎంపీడీవో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా వారు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, అందులో భాగంగా సంగం మండలంలో 11 రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అన్ని కేంద్రాల్లో గోనె సంచులతోపాటు టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారన్నారు. ఏ-గ్రేడ్ పుట్టి (850 కేజీలు) రూ. 19,720, సాధారణ రకం ధాన్యం పుట్టి రూ. 19,550 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. రైతుసేవా కేంద్రంలో ధాన్యం విక్రయించిన 24 గంటల లోపు గోనె సంచులు, వాహనం అద్దె, హమాలీల ఖర్చులతోపాటు ధాన్యం నగదు రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. అంతే కాకుండా తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉన్నా ఒక శాతానికి కేజీ తరుగు చొప్పున 5 కేజీలు మించకుండా తీసుకుని ధాన్యం విక్రయించే వెసులుబాటుకు మిల్లర్లను ప్రభుత్వం ఒప్పించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి, సొసైటీ కార్యదర్శి దస్తగిరి, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

ఆత్మకూరు: మండలంలోని చెర్లో యడవల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి దేవసేనమ్మ శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

●మర్రిపాడు: భీమవరంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు అనీల్‌కుమార్, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్ పాల్గొని రైతులకు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : మండలంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో బి పావని తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధరకు ధాన్యం అమ్ముకోవాలని, దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు.

●సీతారామపురం: మండలంలోని పబ్బులేటిపల్లి, సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని రైతు సేవా కేంద్రాలలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలపై మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో రైతులకు అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి చెన్నారెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎమ్మార్వో కృష్ణారెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శి రామనాథరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : పంట అమ్మకాల సమయంలో దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని తహసీల్దారు హేమంత్‌కుమార్ సూచించారు. శుక్రవారం సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లా డుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయిం చిన మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల న్నారు. కార్యక్రమంలో ఏవో రవికుమార్, ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, వీపీఏలు చంద్రశేఖర్, పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

●వింజమూరు: మండలంలోని చాకలకొండ, గుండెమడకల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయాధికారి శ్రీహరి నారాయణ, మండల పరిషత్ అధికారి శ్రీనివాసులురెడ్డి, తహసీల్దారు హమీద్ శుక్రవారం ప్రారంభించారు. రైతులకు కొనుగోలు కేంద్రం పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

●ఉదయగిరి : గ్రామాల్లో గ్రామసభలు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 12 సచివాలయాల పరిధిలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఎంపీడీవో అప్పాజీ, ఏవో ఆంజనేయుల నాయక్‌లు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్య కొనుగోలు కేంద్రాల ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో పోలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించండి

● అసెంబ్లీలో దేవదాయ శాఖామంత్రి ఆనంకు ఎమ్మెల్యే కాకర్ల వినతి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రధాన పుణ్యక్షేత్రాలైన వెంగమాంబ పేరంటాలమ్మ, ఘటిక సిద్ధేశ్వరాలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం అసెంబ్లీలో దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. ప్రతి ఏడాది ఆయా ఆలయాల బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారని, సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే చింతలదేవిలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహకారంతో 2,500 ఎకరాల్లో కామధేను ప్రాజెక్టును నెల కొల్పడం జరిగిందన్నారు. ఇక్కడ మేలుజాతి ఎద్దులు, ఆవులు, గేదెలు, గొర్రెల పెంపకాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో ఈ కామ ధేను ప్రాజెక్టు రెండోవదని, అభివృద్ధి చేయా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ప్రాజెక్టును వెటర్నరీ శిక్షణా కేంద్రంగా కూడా అభివృద్ధి చేయాలన్నారు. అలాగే పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయంతో అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణం జోరు గా సాగుతోందని, అయితే డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపై చేరి రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉదయగిరి: పోస్టర్లు విడుదల చేస్తున్న సూపర్‌వైజర్ షాను, సిబ్బంది

సీతారామపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా సమాజంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఈవోపీఆర్డీ భార్గవి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం పొదుపు మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, పొదుపు సంఘం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి : స్థానిక కోళ్లవీధి, హెచ్ఆర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సూపర్‌వైజర్ షేక్ షాను ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా సాధికారిత, పౌష్టికాహారం, మహిళల రాణింపు, బాలికల హక్కులు, సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సాగునీటి రంగాలకు తీవ్ర అన్యాయం : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

ఉదయగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సాగునీటి రంగాలకు నిధుల కేటాయింపు విషయంలో తీవ్ర అన్యాయం చోటు చేసుకుందని సీపీఎం రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ప్రారంభమైన ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం వెనుకబడిన ప్రాంతాల పట్ల ప్రభుత్వ వైఖరి తెలుస్తోందన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.394 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. సీతారాం సాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో రూ.7 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పలుమార్లు ప్రజా, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని అనేక సందర్భాల్లో డిమాండ్ చేసినా సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో సరైన కేటాయింపులు జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి రంగానికి కనీస నిధులు కేటాయించి బడ్జెట్‌లో అవసరమైన సవరణలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోడె రమణయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా పాలుగుళ్ల

ఉదయగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షురాలిగా పాలుగుళ్ల విజయలక్ష్మి శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం విజయకుమార్, జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి పెంపులూరి భాస్కర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబోలు రాజేష్‌ల ఆధ్వర్యంలో మండల బీజేపీ అధ్యక్షురాలిగా పాలుగుళ్ల విజయలక్ష్మిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆమెను పలువురు నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఏపీఓగా చెంచయ్య

వింజమూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వింజమూరు మండలానికి ఉపాధి హామీ ఏపీఓగా చెంచయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు పనిచేయాల్సి ఉందని, వారికి కావాల్సిన వాటర్, మజ్జిగ అందజేయాలని సిబ్బందికి సూచించారు.

నేటినుంచి ఉపాధి పనుల పరిశీలన

ఉదయగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు సామాజిక తనిఖీ బృందం సిద్ధమైంది. ఈసందర్భంగా ఏపీవో శ్రీనివాసులు, ఎస్ఆర్పీ బుజ్జి మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల్లో 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉపాధి హామీ పథకం కింద రూ.11 కోట్లు, పంచాయతీరాజ్ రూ.96 లక్షలు, ఇరిగేషన్ రూ.1.94 కోట్లు పనులు జరిగాయన్నారు. వీటికి సంబంధించి జరిగిన పనులను శనివారం నుంచి తనిఖీ బృందం పరిశీలిస్తుందన్నారు. సామాజిక తనిఖీ బృందానికి క్షేత్ర సహాయకులు సహకరించాలని వారు కోరారు.

ఎమ్మెల్యే కాకర్లపై అసత్య ప్రచారాలు మానుకోండి

వింజమూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్ మాదిగ సూచించారు. మండలంలోని బొమ్మరాచెరువు దగ్గర ఉన్న టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, ఆనంద్, పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్ దిష్టిబొమ్మ దహనం చేసున్న జనసేన నాయకులు

కలువాయి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కలువాయి బస్టాండులో శుక్రవారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీసీ అధినేత, మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా వారు ఖండించారు. అనంతరం మార్చి 14వ తేదీన జరుగు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆవిర్భావ దినోత్సవం పోస్టరును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి రాధమ్మ, వెంకటగిరి టౌన్ అధ్యక్షుడు అనిల్ రామారావు, కలువాయి మండల అధ్యక్షుడు పెరంకొండ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

నాటుసారా తయారీదారులకు బెల్లం అందకూడదు : ఎక్సైజ్ ఏసీ, ఈఎస్



బెల్లం వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీదారులకు ముడి పదార్థమైన బెల్లం అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బెల్లం వ్యాపారులకు సూచించారు. నెల్లూరు బీవీనగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నగరంలోని బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ ఏసీ దయాసాగర్, ఈఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకేసారి 10 కిలోల కంటే ఎక్కువగా బెల్లం కొన్న వారి వివరాలు, ఆధార్ కార్డును తప్పనిసరిగా బెల్లం వ్యాపారులు తీసుకోవాలని, అనుమానిత వ్యక్తులకు బెల్లం అమ్మకూడదని ఆదేశించారు. బెల్లం నిల్వ, లావాదేవీల వివరాలు క్రమం తప్పకుండా ఎక్సైజ్ శాఖకు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీ.రమేష్‌బాబు, ఎస్ఐ ఎస్.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం మృతి రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 25 నుంచి 30 ఏళ్లలోపు యువకుడు మృతి చెందాడు. మృతదేహంపై పసుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగు రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. కుడిచేతిపై అమ్మ, సంజీవమ్మ అని పచ్చబొట్లు ఉన్నాయి. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి మహిళ మృతి

పొదలకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గేదెలను తోలుకొని చెరువులోకి వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలో ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని నల్లపాలెంకు చెందిన తురకా నారాయణమ్మ రోజులాగే గురువారం పశువులను మేతకు తాటిపర్తి చెరువులోకి తోలుకెళ్లింది. అక్కడ ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి మృతి చెందింది. బంధువులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలికి భర్త, కుమారు డు, కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హనీఫ్ తెలిపారు.

సీఎంవో నుంచి వచ్చానంటూ మోసం

● కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లి రూ.50 వేలు దోచేశాడు

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి వచ్చామని చెప్పి ఓ వ్యక్తి దంపతులను నమ్మించి రూ.50 వేలు తీసుకుని పరారయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... రాపూరు మండలం తెగచర్లకు చెందిన జయమ్మ, పెద్దయ్య దంపతుల కుమారుడు సింహాద్రి, వారి బంధువు పవన్ హోటల్‌లో ఉద్యోగం కోసం మలేసియా వెళ్లారు. ఏజెంట్ మోసం వల్ల వీసా గడువు ముగియడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై ఈనెల 3న తల్లిదండ్రులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆ విషయం అన్ని పత్రికల్లో వచ్చింది. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి తాను సీఎం కార్యాలయం నుంచి వచ్చానంటూ జయమ్మ, పెద్దయ్యను కలిశాడు. కలెక్టర్ కార్యాలయానికి వస్తే కలెక్టర్‌తో మాట్లాడి మీ పిల్లలను తీసుకువస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మిన తల్లిదండ్రులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయం బయట వారిని కూర్చోబెట్టి కలెక్టర్‌తో మాట్లాడి వస్తానని లోపలికివెళ్లాడు. కొద్ది సేపటికి తిరిగివచ్చి అన్నీ మాట్లాడేశానని, సింహాద్రి, పవన్‌ను తీసుకొచ్చేందుకు విమానం టికెట్లు, ఇతర ఖర్చులకు రూ.60 వేల వరకు పెట్టుకోవాలని చెప్పాడు. అంత ఇచ్చుకోలేమని తల్లిదండ్రులు రూ.50 వేలు ఇచ్చారు. ఆ నగదు తీసుకున్న వ్యక్తి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో పెద్దయ్య అతని ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బాధితులు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులపై దాడి

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): దంపతులపై దాడి చేసిన వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నజీర్‌తోటకు చెందిన దామోదర్‌రావుకు తోడల్లుడు కోటేశ్వరరావుకు ఆస్తి విషయంలో మనస్పర్థలున్నాయి. శుక్రవారం దామోదర్‌రావు అతని భార్యపై కోటేశ్వరరావు, అతని బంధువులు రాళ్లతో దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

రైసుమిల్లు యజమానిపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పంట వీధికి చెందిన పందాపాటి పవన్‌కుమార్‌రెడ్డి వద్ద వరి ధాన్యం తీసుకొని డబ్బు ఇవ్వలేదన్న ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని యనమలపాలెం వద్ద ఉన్న శ్రీ సాయిబాబా రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లు యజమాని శ్రీరాం శేఖర్‌బాబు పవన్‌కుమార్‌రెడ్డి వద్ద రూ.8.31 లక్షల విలువ చేసే వరి ధాన్యం కొనుగోలు చేశారు. అయితే నగదు చెల్లించకపోవడంతో బాధితుడు శుక్రవారం శ్రీరాం శేఖర్‌బాబుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మోసం కేసు రిజిస్టర్ చేశారు.

సక్సెస్ ఈజ్ రివెంజ్

మహిళలు సెల్ఫ్ రెస్పెక్ట్ లేకుంటే తమను తాము కోల్పోతారు. ధైర్యంగా ఉంటే తమను తాము రక్షించుకుంటూ ఏ రంగంలో అయినా రాణించగలుగుతారు. తెలంగాణలోని యాదాద్రి మాది. నాన్న లింగారెడ్డి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో నా చదువు అంతా హైదరాబాదులోనే సాగింది. అమ్మ వనజ గృహిణి. ఉన్నత స్థానంలో ఉంటేనే మహిళకు ప్రత్యేక గౌరవం ఉంటుందని చెబుతూ పెంచారు. బీటెక్ పూర్తి చేసి తొలుత ఓ ప్రైవేటు కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేశా. 2018 నుంచి ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా అడుగులు వేశాను. సీడీపీవో ఉద్యోగం సాధించి ఆ తర్వాత గ్రూప్ పరీక్షలు రాస్తూ వచ్చాను. 2022లో ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన గ్రూప్ పరీక్షల్లో 6వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాను. గుంటూరు జిల్లాకు చెందిన హైకోర్టు అడ్వకేట్ కల్యాణ్ చక్రవర్తితో పెళ్లి అయ్యింది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో డీఎస్పీ ఉద్యోగం సాధించాను. రెండేళ్ల ట్రైనింగ్‌లో నా భర్త అందించిన సహకారం మరువలేనిది. ఇప్పటికీ నా ఉద్యోగం నేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నానంటే అందుకు ఆయనే కారణం. మహిళలను ఎవరైనా అవమానిస్తే మనం గొప్పగా ఎదిగి చూపితే వారికి నిద్ర కూడా పట్టదు. అదే మన సక్సెస్. ప్రతి మహిళ ఉన్నత చదువులు చదువుకోవడంతోపాటు మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలి.

- పి సింధుప్రియ, నెల్లూరు నగర డీఎస్పీ



కుటుంబ సభ్యులతో డీఎస్పీ సింధుప్రియ(ఫైల్)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విద్యతోనే ఆడవాళ్లకు సాధికారత



విద్యతోనే ఆడవాళ్లకు సాధికారత సాధ్యమని నేను నమ్ముతాను. విద్యతోనే అవగాహన, అవకాశాలు, హక్కులు, స్వేచ్ఛ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో తెలుసుకోగలం. అప్పుడే బాధ్యతాయుతంగా మెలుగుతారు. అదేవిధంగా సొంత నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఈరోజు ఈస్థాయిలో ఉన్నానంటే దానికి కారణం చదువని బలంగా నమ్ముతాను. కష్టపడి చదువుకున్నాను కాబట్టే వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, వృత్తిపరంగా సంతోషంగా జీవించగలుగుతున్నా. కుటుంబ బాధ్యతల ను ఇద్దరం చూసుకుంటున్నాం. వృత్తిరీత్యా ఎక్కువ సమయం కుటుంబ సభ్యులతో గడపలేకపోతున్నప్పటికీ సమయం దొరికినప్పుడు కుటుంబమే లోకం. ముఖ్యంగా మావారు నన్ను బాగా అర్థం చేసుకుంటారు. ఆయన సహకారంతోనే సంతృప్తికరమైన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. వృత్తిగతంగా నిజాయితీగా పనిచేయడం, అందరి సహకారంతో లక్ష్యాలను పూర్తిచేసేందుకు నూరుశాతం ప్రయత్నిస్తూ విజయం సాధిస్తున్నాను. సాంకేతికపరమైన సమస్యలు ఎదురైతే వాటిని దాచి పెట్టను. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నా. అందరి పనితీరు ఒకేలా ఉండదు కాబట్టి అర్థం చేసుకుంటూ పని గురించి అవగాహన కల్పిస్తూ, నేను నేర్చుకుంటూ లక్ష్యాలను చేరుకుంటున్నా.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

న్యూస్ బాక్స్

కందుకూరు తహసీల్దారు ఇక్బాల్ బదిలీ

● నూతన తహసీల్దారుగా లావణ్య



కందుకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి):స్థానిక తహసీల్దారు ఇక్బాల్ కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయ ఏఓగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఉలవపాడు తహసీల్దారు లావణ్యను నియమించారు. సబ్ కలెక్టరు కార్యాలయంలో ఏఓ శ్రీనివాసరావును ఉలవపాడు తహసీల్దారుగా బదిలీ చేశారు.

రైతు పనులకు ప్రాధాన్యం



మస్టర్లను తనిఖీ చేస్తున్న కందుకూరు ఏపీడీ బాబూరావు

లింగసముద్రం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది మొదటగా రైతువారీ పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కందుకూరు ఏపీడీ బాబూరావు ఆదేశించారు. శుక్రవారం చినపవని, ముత్యాలపాడులో జరుగుతున్న పంట కాలువ పూడికతీత పనులను పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. జూన్ వరకు గ్రామాలవారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏ జీవీ రాఘవులు, బీఎఫ్‌టీ జక్రయ్య, ఎఫ్ఏలు రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కావలి రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): గతేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుమ్మడిబందల కొమరా జయరామయ్య (49) గురువారం రాత్రి కోలుకోలేక మరణించాడు. బెంగుళూరు సమీపంలో జరిగిన ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా జయరామయ్య తీవ్రంగా గాయ పడిన విషయం తెలిసిందే. మృతుడికి భార్య ప్రభావతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

● 11 మంది అరెస్టు

● 10ఫోన్లు, రెండు కార్ల స్వాధీనం

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):కోడిపందేల స్థావరాలపై ఎస్ఐ కిషోర్‌బాబు శుక్రవారం సిబ్బందితో దాడులు నిర్వహించారు. 11మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ62,740 నగదు, రెండు కార్లు, 10ఫోన్లు, ద్విచక్రవాహనం, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి అమానుషం

కందుకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో ఓ వర్గం దాడి చేయడం అమానుషం అని ఇలాంటి దాడులపై ప్రభుత్వం కఠినంగా వ్యహరించాలని విశ్వహిందూ పరిషత్ కావలి జిల్లా అధ్యక్షుడు ఉప్పుటూరి కొండపనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వచ్చేది కాలి బూడిదయ్యాకే..

● అల్లూరులో లేని అగ్నిమాపక కేంద్రం

● ప్రమాదం జరిగితే వాహనం కావలి, నెల్లూరు నుంచి రావాల్సిందే..

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):వేసవికాలం సమీపిస్తుందంటే ఏ సమయం ఏ గ్రామంలో అగ్నిప్రమాదం సంభవిస్తుందో అని గ్రామస్థులు ఆందోళనకు గురవుతారు. కారణం మండలానికి సమీపంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడమే. అగ్నిప్రమాదం జరిగితే సుదూర ప్రాంతాలైన కావలి, నెల్లూరు నుంచి అగ్నిమాపక కేంద్రం నుంచి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. వచ్చినవారు ఉన్న మంటలను ఆర్పడం తప్ప ఇంకేమీ లాభం లేకుండా పోతుంది.

● గతేడాది జరిగిన సంఘటనలు..

మండలంలోని నార్త్‌మోపూరు, గోగులపల్లి, పురిణి పంచాయతీ మందిరంతో పాటు అనేక ప్రాంతాల్లో చోటు చేసుకున్నాయి. 2015లో పురిణి పంచాయతీ మందిరం గ్రామంలో విద్యుత్ తీగలు రాజుకొని షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పులు చెలరేగాయి. సమీపంలోని 9పూరి గుడిసెలకు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయి కట్టుబట్టలతో 9కుటుంబాలు వీధినపడ్డాయి. దీనిని ఆర్పేందుకు స్థానికులు పడిన కష్టం వర్ణనాతీతం. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే సరికే పూర్తిగా కాలిపోయి బూడిద మిగిలింది. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు.

● అల్లూరులో కేంద్రం ఉండాలి..

మండలకేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అల్లూరుతో పాటు కొడవలూరు, దగదర్తి, బోగోలు మండలాలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతాల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న అరగంటలోపే ఘటనా స్థలనాకి చేరుకొని ప్రమాదాన్ని అరికట్టవచ్చు. ప్రస్తుతం నెల్లూరు, కావలిలోని అగ్నిమాపక కేంద్రాల నుంచి సిబ్బంది ఘటనా స్థలానికి రావాలంటే దాదాపు మూడు గంటల వ్యవధి పడుతోంది. దీంతో ప్రమాద స్థలంలో పూర్తిగా ఆస్తులు నష్టపోవాల్సి వస్తోంది. అగ్నిమాపక కేంద్రాన్ని అల్లూరులో ఏర్పాటు చేస్తే ఇలాంటి పరిస్థితి నుండి కొంత మేర బయటపడే అవకాశం ఉంది.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

ప్రమాదాలు జరుగుతున్నాయి



వేసవి సమీపిస్తే ఎన్నో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, ఏదో ఒక కారణంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని ఆర్పేందుకు అవస్థలు పడుతున్నాం. అందుబాటులో అగ్నిమాపక కేంద్రం లేక ఆస్థులను నష్టపోతున్నాం.

- దానం రజిని, జవ్వాగు లక్ష్మీపురం

తీవ్రంగా నష్టపోతున్నాం..



అగ్నిమాపక కేంద్రాలు దూర ప్రాంతాల్లో ఉండటంతో ప్రమాదం జరిగిన ఎంతోసేపటికి వాహనం రాదు. దీంతో నిప్పు ఒక దాని నుండి మరోదానికి అంటుకుంటూ తీవ్రం అవుతుంది. స్థానికంగా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మంచిది.

- పాడేటి రాజశేఖర్, అల్లూరు

మహిళల ముందస్తు సంబరం

కావలి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. మద్దూరుపాడు డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో మహిళా అధ్యాపకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం జరిగిన పోటీల విజేతలకు కరస్పాండెంట్ సుధీర్ నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రాఘవులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే జేవీవీ ఆధ్వర్యంలో ఉపాధ్యాక్షురాలు కల్యాణి అధ్యక్షత జరిగిన వేడుకలో జేవీవీ సమతా విభాగం నాయకురాలు విజయమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ రవికుమార్, ఉమాశర్మ, శారద పాల్గొన్నారు. చివరిగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు శ్యామల అధ్యక్షతన కలుగోళమ్మపేట హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళల హక్కులపై అవగాహన కల్పించారు.

● కావలి: స్థానిక రవి నర్సింగ్ హోంలో జేవీవీ జిల్లా నాయకురాలు కల్యాణి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేవీవీ సమతావింగ్ రాష్ట్ర నాయకురాలు విజయమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో జేవీవీ కావలి శాఖ గౌరవాధ్యక్షులు బెజవాడ రవికుమార్, అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరెడ్డి హరినాద్, కోశాధికారి సుబ్బరాయశర్మ, నేతలు జానకిరాం, మురళీ క్రిష్ణ, సుధాకర్, రమణయ్య, శారద, స్వర్ణలత పాల్గొన్నారు.

● కందుకూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ రెండురోజుల క్రీడాపోటీలు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ప్రారంభించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, ఎంబీఏ విభాగాధిపతి పావని పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: స్థానిక స్టేట్‌బ్యాంక్ శాఖ మేనేజర్ నరేష్‌బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కందుకూరు అత్రోట, శారదా, సంకల్ప ఆస్పత్రుల వైద్యులు మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సౌందర్య, వాసవి, శివిరిలు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

● బిట్రగుంట: మహిళలను గౌరవించడం భారతీయ సంస్కృతి, సాంప్రదాయమని ఆర్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి అన్నారు. కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకలో అపోలో ఆస్పత్రి వైద్యులు శ్రావణి రెడ్డి, కోవూరు ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారి ఎం.తేజశృతి, ఆర్ఎస్ ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్ర జ్యోతి సన్మానించారు. కార్యక్రమంలో కళశాల ఏవో ఆర్వీ రమణారెడ్డి, అన్ని విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



కావలి: కేక్‌కట్ చేస్తున్న మహిళా అధ్యాపకులు



బిట్రగుంట: మహిళా అధికారులను సన్మానిస్తున్న ఆర్ఎస్ఆర్ అధ్యాపకులు



వలేటివారిపాలెం: పాల్గొన్న మహిళాధికారులు

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో?



కలిగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కలిగిరమ్మ కూడలి ప్రాంతం జనాలు, వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతం నుంచే విజయవాడ, చెన్నై, బెంగుళూరు, కందుకూరు మార్గాల వైపు నిత్యం వందలాదిమంది వాహనాల్లో ప్రయాణాలు చేస్తూ ఉంటారు. దీనికి తోడు ఈ ప్రదేశం ముఖ్యమైన వాణిజ్య సముదాయం కావడంతో కూరగాయలు, ఫల సరుకులు, మాంసం, పండ్లు తదితర వస్తువుల కొనుగోలు దారులతో ఈ ప్రాంతం ఉదయం, సాయంత్రం వేళలో రద్దీగా ఉంటుంది. కొందరు వ్యాపార దుకాణదారులు రోడ్డుపైకి చొచ్చుక రావడంతో ప్రధాన రహదారి కుచించుకుపోయ్యింది. దీనికితోడు ఆటోలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతుంది. కూడలి ప్రాంతానికి కూతవేటుదూరంలో పోలీస్ స్టేషన్ ఉన్నా ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాల్లో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నట్లు నార్త్ ఆములూరు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ ప్రసన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివే విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. అభ్యర్థులు బీసీ, ఈబీసీలు 2014-16 మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2013-16 మధ్య జన్మించి ఉండాలన్నారు. మండలానికి 40సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు మార్చి 15లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కావలి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మద్దూరుపాడు, తుమ్మలపెంట, చెన్నయపాలెంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 11కేవీ విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం విద్యుత్‌కు అంతరాయం ఇస్తున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 12.30వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో సరఫరా నిలిపివేస్తామన్నారు.

● కందుకూరు: పట్టణంలోని కేసరిగుంట కాలనీకి వెళ్లేదారిలో లైన్‌వర్క్ ఉన్నందున గణేష్‌నగర్, కేసరిగుంట కాలనీ, వెంగమాంబ ఫంక్షన్‌హాలు వెనుక, సింహాద్రినగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని టౌన్ ఏఈ టీవీ నరసింహ్మం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే గవర్నమెంటు ఆస్పత్రి వెనుక ఉన్న సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగే ఎల్ఐసీ, ఎస్బీఐ, పామూరు రోడ్డు, శివాలయం వీదర్లకు ఉదయం 7గంటల నుంచి 9వరకు సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు

95మందికి రూ.4లక్షల జరిమానా



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ నాగేశ్వరరావు, విజిలెన్స్ ఈఈ హైమావతి తదితరులు

లింగసముద్రం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను అక్రమంగా వినియోగించడం చట్టరీత్యా నేరమని కందుకూరు విద్యుత్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.నాగేశ్వరరావు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హైమావతి అన్నారు. శుక్రవారం వారు శాఖల సిబ్బంది 90మందితో కలిసి 29బృందాలుగా ఏర్పడి పెదపవని, చినపవని, మొగిలిచెర్ల, వీఆర్‌కోట, అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడు, ఆర్ఆర్.పాలెం, నారసింహాపురం గ్రామాల్లో దాడులు చేసి 2,865 సర్వీసులను తనిఖీ చేశారు. అనంతరం వివరాలు వెల్లడించారు. తనిఖీలో 95 మంది అక్రమంగా విద్యుత్‌ను చౌర్యం చేస్తు న్నట్లు గుర్తించి రూ.4.1లక్షల జరిమానా విధించామన్నారు. దాడుల్లో డీఈ విజయ్‌బాబు, మండల ఏఈ షేక్ ఫిరోజ్, పలువురు ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ సభ్యులు ఆర్థికంగా ఎదగాలి

● రాళ్లపాడులో చేప పిల్లలు వదిలిన సబ్ కలెక్టర్, మత్స్యశాఖ అధికారులు



చేప పిల్లలు వదులుతున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, జిల్లా ఫిషరీస్ జేడీ నాగేశ్వరరావు

లింగసముద్రం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. శుక్రవారం నెల్లూరు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి ఆమె రాళ్లపాడు ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కావలి ఫిషరీస్ సహాయ డైరెక్టర్ శ్రీనివాసులు కావలి ఎఫ్‌డీఓ లక్ష్మణ్ నాయక్, ఫిషరీస్ అసిస్టెంటు షేక్ అస్మా, రాళ్లపాడు డీఈ వెంకటేశర్లు, ఏఈ చంద్రమౌళి, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌ఓ వినోద్, మత్స్యకార సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ బొప్పూరి సిద్దయ్య, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్ ప్రాజెక్టు ఆయకట్టు చెర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, మద్దాల రామారావు, గంగినేని మధు, చెంచునాయుడు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన 48గంటల్లోనే నగదు జమ

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 48గంటల్లోనే నగదు వారి ఖాతాలో జమయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో 13ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, తేమశాతం 17గా నమోదయ్యేలా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ రజనీకాంత్ మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని మిల్లర్ల వద్ద అధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. 13ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో పాల్గొని నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: రైతులు పండించిన ధాన్యంను దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. పోకూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాని శుక్రవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కందుకూరు డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ హేమంత్‌భరత్‌కుమార్, ఎంపీడీఓ నరేంద్ర దేవ్, వీఆర్వో మనోజ్ పాల్గొన్నారు.

● కందుకూరు: వరి పంట వేసిన రైతులు తప్పకుండా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకుని, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకుని లబ్ధిపొందాలని ఏడీఏ అనసూయ సూచించారు. మోపాడు, మహదేవపురం, పలుకూరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. డివిజనల్ సహకార అధికారి రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేవీ సుబ్బా రావు, తహసీల్దారు ఇక్బాల్ అహ్మద్, కో ఆపరేటివ్ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ రావు, పీఏసీ ఎస్‌ల సీఈఓలు హరికృష్ణ, శ్రీతేజ, వ్యవసాయ సహాయకులు రమణయ్య, బ్రాహ్మణి పాల్గొన్నారు.

● ఉలవపాడు: మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దారు లావణ్యవేణి, మండల వ్యవసాయశాఖ అధికారి తిరుమల జ్యోతిలు చాగొల్లు రైతుసేవా కేంద్రంలో అవగాహన కల్పించారు.

● జలదంకి: బ్రాహ్మణక్రాక, చామదలలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వింజమూరు ఏడీఏ రామిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో జలదంకి వ్యవసాయాధికారి శైలజ పాల్గొన్నారు.

● కలిగిరి: ఎంపీడీఓ ప్రత్యూష, వ్యవసాయాధికారి ఎంసురేష్‌బాబు, తహసీల్దారు రవీంద్రబాబులు పోలంపాడు, వెలగపాడు, కలిగిరి, 1-2, నాగసముద్రం, కృష్ణారెడ్డిపాలెం, పెద్దకొండూరు రైతుసేవాకేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచు కల్లూరు రేష్మ, వీఏఏలు వెంకటేశ్వర్లు, కొండలరావు, అనూష, సుజాత పాల్గొన్నారు.

● కొండాపురం: ఎంపీడీఓ ఆదినారాయణ రావు కొమ్మి, గరిమెనపెంట, సాయిపేట కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు కోటేశ్వరరావు, వ్యవసాయాధికారి షేక్ సైదాలతో కలిసి ఎంపీడీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి యారవ కృష్ణయ్య, ఏఈఓ ఈశ్వరాచారి, వీఏఏ లు గరిమెన పెంట, కొమ్మి పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ప్రత్యూష



ఉలవపాడులో..

రేపు గుడ్లూరులో ట్రై సైకిళ్ల పంపిణీ

కందుకూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 136 మంది వికలాంగులకు వీపీ ఆర్ ట్రస్టు ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి దంప తులు మోటారైజ్డ్ ట్రైసైకిళ్లు అందజేస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం ఎంపీ కార్యాలయం నుంచి ప్రకటనలో వెలువడింది. ఆదివారం గుడ్లూరులో నిర్వ హించ నున్న ఆత్మీయ సమ్మేళనంలో కందుకూరు మున్సి పాలిటీలో 8మందికి, రూరల్ మండలంలో 16మందికి, ఉలవపాడు మండలంలో 38మందికి, లింగసముద్రం మండలంలో 26మందికి, గుడ్లూరులో 29మందికి, వలేటివారిపాలెంలో 19మందికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కాన్షీరాం జయంతిని జయప్రదం చేయండి

కందుకూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆశాజ్యోతి కాన్షీరాం జయంతిని ఈనెల 15న వెంగమాంబ ఫంక్షన్‌హాలులో నిర్వహి స్తున్నట్లు రాడికల్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలు తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణను శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెజవాడ కొండయ్య, ముప్పవరపు కిషోర్, గేరా చిరంజీవి, హరిప్రసాద్, పొనుగోటి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, విద్య అవసరం

● డీఎంహెచ్‌వో సుజాత

వెంకటాచలం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే ఆత్మవిశ్వాసం, విద్య, ఆర్థిక స్వావలంబన అత్యంత ముఖ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు నాయకత్వపాత్ర పోషించేలా తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. అనంతరం పలువురికి శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. పాటలు, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డీన్ సుజా ఎస్ నాయర్, డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ జీ.విజయలక్ష్మి, డాక్టర్ సాయిస్రవంతి, సీహెచ్ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో సుజాతను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న వీఎస్‌యూ రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపాల్ విజయ



తోటి మహిళాలను ప్రోత్సహించాలి

● డాక్టర్ సునీత, రిజిస్ట్రార్, విక్రమ సింహపురి యూనివర్సిటీ



తోటి మహిళాలకు వీలైనంత వరకు మనవంతు సహాయం అందించి ప్రోత్సహించాలి. నా స్వయం కృషితో తొలుత పద్మావతి యూనివర్సిటీలో కౌన్సిలర్‌గా తన ప్రయాణం ప్రారంభమైంది. ఎస్వీ యూనివర్సిటీలో ఐదేళ్ల అకాడమిక్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఆ తర్వాత 2009లో విక్రమ సింహపురి వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి రిజిస్ట్రార్ స్థాయికి ఎదిగాను. నా ఎదుగదలకు గురువుల సలహాలు ఎంతో తోడ్పాటునిచ్చాయి. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు ఎక్కువగా ఉన్నా నిజాయితీ, నిబద్ధతతో నా బాధ్యతలను నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నాను. ఎంత ఒత్తిడి ఉన్నా సహచర ఉద్యోగులు, సిబ్బంది సహకారం బలాన్ని ఇస్తుంది. మా తల్లిదండ్రులు, నా భర్త, కుటుంబ సభ్యులు నా వృత్తి ధర్మాన్ని అర్థం చేసుకొని సహకరిస్తున్నారు. నాకు ఒక్కడే కుమారుడు. నేను కుటుంబాన్ని, ఉద్యోగాన్ని సమానంగా చూస్తాను. నా విద్య అంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగింది. నాకు ఏ లోటు లేకుండా నా తల్లిదండ్రులు బాగా చదివించారు. మహిళలు ఎక్కడ వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగుతూ ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. సమాజంలో ప్రతి మహిళా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందాలి. ఆదిశగా వారి వృత్తుల్లో రాణించాలి.

వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందినా, ఎన్ని అత్యాధునిక వైద్య విధానాలు, ఆవిష్కరణలు వెలుగులోకి వచ్చినా కొన్ని వ్యాధులు మాత్రం శతాబ్దాలుగా సమాజాన్ని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. అలాంటి వాటిలో కుష్టు రోగం ఒకటి. జిల్లాలో ఈ చర్మవ్యాధి బారినపడేవారు ఏటా పెరుగుతూనే ఉన్నారు. కుష్టు నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ఏటా రెండు సార్లు సర్వే నిర్వహించి కొత్త కేసులను గుర్తిస్తోంది. రోగులకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తోంది. అయితే అవగాహనలోపం, మూఢనమ్మకాలతో కుటుంబం సభ్యుల నుంచి, సమాజం నుంచి వ్యాధిగ్రస్తులు వివక్షకు, నిరాదరణకు గురవుతున్నారు.

- జిల్లాలో ఏటా కొత్త కేసులు
- వైద్యశాఖ సర్వేతో వెలుగులోకి
- తాజాగా 28 మంది గుర్తింపు
- అందుబాటులో అత్యాధునిక వైద్యం
- 2027 నాటికి నిర్మూలనే లక్ష్యం

కుష్టు కేసులు వస్తూనే ఉన్నాయ్!

నెల్లూరు (వైద్యం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొత్తగా కుష్టు వ్యాధి సోకిన వారు ఏటా వెలుగులోకి వస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి నిర్మూలన కోసం 2020వ సంవత్సరం నుంచి ఏటా జనవరి, జూలై మాసాల్లో వైద్య ఆరోగ్యశాఖ సర్వే నిర్వహి స్తోంది. 2027వ సంవత్సరానికి జిల్లాలో కుష్టువ్యాధిని నివారించాలన్న లక్ష్యాన్ని కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశించడంతో ఆ దిశగా వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. చర్మంపై రెండుకు మించి మచ్చలు ఉంటే అది కుష్టుగా అనుమానించి వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవా లని వైద్యులు సూచిస్తున్నారు.

1875 బృందాలతో సర్వే

జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధి కొత్త కేసులు గుర్తించేందుకు ఈ ఏడాది వైద్యశాఖ 1875 బృందాలను నియమించి ఇంటింటి సర్వే చేపట్టింది. 16 రోజులు జిల్లా వ్యాప్తంగా ఉన్న 38 మండలాల్లో ఈ సర్వే సాగింది. కేంద్ర బృందం కూడా గ్రామాల్లో పర్యటించి వ్యాధిగ్రస్తులను గుర్తించింది. బాధితులతోపాటు చుట్టుపక్కల వారికి వ్యాధి సోకకుండా పెప్ (పోస్ట్ ఎక్స్‌ప్లోజర్ ప్రొపిలాక్సిస్) చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 28 కేసులను గుర్తించారు.

ఏటా వస్తున్న కొత్త కేసులు

సంవత్సరం	కొత్త కేసులు
2020-21	207
2021-22	113
2022-23	99
2023-24	75
2024-25	28

1034 మంది వ్యాధిగ్రస్తులు..

జిల్లాలో 1989లో 65,587 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధి నివారణకు మూడు దశాబ్దాలుగా ప్రత్యేక కృషి జరుగుతోంది. డీఎఫ్ఐడీ వంటి అంతర్జాతీయ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు కూడా ఇందులో భాగమవుతున్నాయి. ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ పరంగానూ ప్రతి పీహెచ్‌సీలో వ్యాధి నివారణ మందులు అందిస్తున్నారు. మల్టీథెరపీ ట్రీట్‌మెంట్ అమలయ్యాక వ్యాధి నియంత్రణలోకి వచ్చింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 1034 మంది చికిత్స పొందుతున్నారు. అయితే కొందరిలో అవగాహన లోపం కారణంగా తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఈ వ్యాధి ఇతరులకూ సోకుతోంది. మరి కొందరిలో నిర్లక్ష్యం కారణంగా పరిస్థితి వికటించి వైకల్యానికి దారితీస్తోంది.



మనుబోలు, విడవలూరులలో సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందాలు

వ్యాధి లక్షణాలు

- స్పర్శలేని మచ్చలు
- ముఖంపై మెరిసే చర్మం
- అరచేతులు, అరికాళ్లలో కండరాల బలహీనత లేదా అంగవైకల్యం
- కన్ను ఎగువరెప్పలు బలహీనంగా ఉండడం
- చేతులు, పాదాలలో నొప్పిగా అనిపించని పుండ్లు ఉండటం
- కళ్ల పూర్తిగా మూసుకుపోవటం
- చర్మం, చెవిపై బుడిపెలు ఉండటం

అత్యుత్తమ చికిత్సలు



జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఏటా రెండుసార్లు సర్వే చేపడుతున్నాం. కొత్త కేసులు వస్తునే ఉన్నాయి. వారికి వెంటనే అత్యుత్తమ చికిత్సలు అందించేలా కృషి చేస్తున్నాం. కొందరు త్వరగా కోలుకుంటున్నారు. వ్యాధి గ్రస్తులకే కాకుండా చుట్టుపక్కల వారికి వ్యాధి వ్యాపించకుండా పెప్ పేరుతో ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నాం. 2027 నాటికి కుష్టు నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నాము.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా కుష్టు నివారణాధికారి



ఎంఐజీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న నుడా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ,అధికారులు

ఆదర్శంగా ఎంఐజీ లేఅవుట్లను తీర్చిదిద్దుతాం

- నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి
- 6నెలల్లో మౌలిక వసతులన్నీ సమకూర్చుతాం
- కావలిలో అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు

కావలి, మార్చి7 (ఆంధ్రజ్యోతి):జిలాల్లోనే ఆదర్శంగా కావలి ఎంఐజీ (మినిమమ్ ఇన్‌కం గ్రూప్) లేఅవుట్‌ను తీర్చిదిద్దుతామని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులోని ఎంఐజీ లేఅవుట్‌ను శుక్రవారం ఆయన నుడా వైస్‌ఛైర్మన్ సూర్యతేజ, కావలి ఆర్డీవో సన్నీ వంశీ క్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, నుడా అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు విద్యుత్, మంచినీటి సౌకర్యం, రోడ్ల మధ్య చేపట్టాల్సిన కల్వర్టులు నిర్మాణాలను గురించి వివరించారు. అక్కడకు వచ్చిన దళితవర్గాల నాయకులు ఎస్సీ, ఎస్టీలకు లేఅవుట్‌లో తక్కువ ధరలకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. పొలాలిచ్చిన జమ్మలపాలెంవాసులకు సరైన ధర ఇవ్వలేదని, ఇంకా 27 మందికి పరిహారం చెల్లించలేదన్నారు. అనంతరం పోలీస్ కమాండ్‌కంట్రోల్ రూమ్ అతిథిగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో కోటంరెడ్డి మాట్లాడారు. ఎంఐజీ లేఅవుట్ మధ్యలోని ప్రయివేట్ స్థలంను తీసుకుని లేఅవుట్‌లో కలిపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లేఅవుట్ ప్రవేశమార్గంను 20అడుగుల నుంచి 40అడుగుల రోడ్డుగా పెంచుతామన్నారు. ప్రతి రెండు నెలలకోసారి తాను వచ్చి పనులు పరిశీలిస్తానని తెలిపారు.

● కావలిలో అక్రమ లేఅవుట్లపై చర్యలు

జిల్లాలోని అక్రమ లేఅవుట్లలో సగం కావలిలోనే ఉన్నాయని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీని వాసులు రెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కూడా ఆక్రమించుకుని లేఅవుట్‌లలో కలుపు కున్నారని ఈ విషయంపై ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డితో మాట్లాడి తగుచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు పాల్గొన్నారు.

రంగడి బ్రహ్మోత్సవాలు

రాజీ లేకుండా నిర్వహించండి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా, వసతుల కల్పనలో రాజీలేకుండా నిర్వహించాలని ఆలయ ఈవో, అర్చ కులను దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన కోసం ఆయన శుక్రవారం రంగనాథస్వామి ఆలయానికి విచ్చేశారు. స్వామి, అమ్మవార్లు, ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు, అర్చకులతో చర్చించారు. జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అర్చ భూమి శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి ఆలయంలో అర్చకులు, అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్

22 మంది అడ్మిన్లకు

షోకాజ్ నోటీసులు

నెల్లూరు(సిటీ), మార్చి 7(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడిన 22 సచివాలయాల అడ్మిన్లకు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆస్తి పన్ను వసూళ్లలో భారీ లక్ష్యం చేరుకోగలరా...? అన్న అంశంపై ఆంధ్రజ్యోతి గురువారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. సచివాలయాల వారీగా పన్ను వసూళ్లపై ఆరా తీవారు. కొందరు అడ్మిన్లు జీరో వసూళ్లు చూపడంతో నోటీసులు జారీ చేశారు. ప్రస్తుత ఏడాది పన్నులో నూరు శాతం, బకాయిలో 75 శాతం వసూలు చేసి తీరాల్సిందేనని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో రాహుకాల ఉద్వాపన పూజలు, అలంకారం

రాహుకాల ఉద్వాపన పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజ రాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాహుకాల ఉద్వాపన పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. 18 వారాలు రాహుకాల దీపాలు వెలిగించిన భక్తులు 19వ వారం ఉద్వాపన పూజలు చేస్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి భక్తులతో సామూహికంగా ఈ పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, విశేష నవావరణ పూజలు, అనంతరం అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు, వేదపారాయణం, పల్లకీ సేవలు జరిగాయి. ఆలయ ఈవో, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

పార్టీ పేరు చెప్పి

దందాలు చేస్తే చర్యలు

● ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు మాబు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌పీఐ పార్టీ పేరు చెప్పి దందాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు హెచ్చరించారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌పీఐ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తులు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో పార్టీ పేరు చెప్పి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రని ఆరోపించారు. పేరం శివ నాగేశ్వర రావు గౌడ్ అనే వ్యక్తి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆర్‌పీఐలో గొడవలు సృష్టించడంతో అతనిని ఆరేళ్లు పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. మిరియాల వెంకట రమణయ్య అనే వ్యక్తి నిరుపేదలకు ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తానని రూ.కోట్లు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. అతడిని గతంలోనే పార్టీ నుంచి సస్పెండ్ చేసిట్లు చెప్పారు. అయినా పార్టీ పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు దాసరి కమలాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తల మధుసూదన్, తాటిపర్తి ప్రభాకర్, ఏ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'పీఎంశ్రీ' నిధులు సద్వినియోగం చేసుకోవాలి

● ఏప్రిల్ ఆఖరులోపు ఖర్చు చేయండి ● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం సమగ్రశిక్ష అధికారులు, ఇంజనీర్లు, హెచ్ఎంలతో ఆయన సమీక్షించారు. పాఠశాలల్లో విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఆ పథకం కింద జిల్లాలో ఎంపికైన 42 పాఠశాలల్లో కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, లైబ్రరీలు, కిచెన్ షెడ్స్, మరుగుదొడ్లు వంటి నిర్మాణాలకు రూ.5.33 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.3కోట్ల నిధులు ఖర్చయ్యాయని, మిగిలిన నిధులను ఏప్రిల్ ఆఖరిలోపు ఖర్చు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వెనక్కు వెళ్లకూడదన్నారు. రానున్న ఐదేళ్లను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారుచేసి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకం కింద పాఠశాలల్లో ప్లాంటేషన్, సీసీ రోడ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఈఈ సుబ్బరాయులు, ఏఎంవో సుధీర్ బాబు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

గురుకులాల్లో ప్రవేశాలకు

దరఖాస్తు గడువు పెంపు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 13వతేదీ వరకు పొడిగించారని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈటీ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ టీ పద్మజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 2వతేదీ నుంచి ఈ నెల 6వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా ప్రకటించారని, అయితే విద్యార్థుల తల్లి దండ్రుల కోరిక మేరకు గడువును పొడిగించారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, పూర్తి వివరాలకు సమీపంలోని గురుకులాల్లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం

జిల్లాకు చేరిన 40వేల జవాబు పత్రాలు

నెల్లూరు(విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సంస్కృతం పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనాన్ని శుక్రవారం నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 40 వేల జవాబు పత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. అధికారులు కట్టుదిట్టమైన భద్రత మధ్య వాటిని స్ట్రోరేజీ పాయింట్‌లో భద్రపరిచి మూల్యాంకనం సమయానికి అందచేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం జరగనుంది. అధ్యాపకులు ఒక్కొక్కరు రోజుకు 30 జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా, కేఏసీ కాలేజీలో ఇంటర్‌బోర్డు అధికారులు, అధ్యాపకులతో శుక్రవారం ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సమీక్ష జరిపారు. ఈ ఏడాది స్పాట్ కేంద్రాల్లోనే స్కానింగ్ ఏర్పాటు చేసి మూల్యాంకనాన్ని త్వరతగతిన పూర్తి చేసేలా ఇంటర్‌బోర్డు శ్రీకారం చుట్టిందన్నారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విద్యార్థికి న్యాయం జరిగేలా మూల్యాంకనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఏసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, సౌత్ మోపూరు కళాశాలప్రిన్సిపాల్ ఎం విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మూల్యాంకనం విధులకు హాజరైన సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

ఇంటర్ పరీక్షలకు 24,058 హాజరు...

ఇంటర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ద్వితీయ సంవత్సరం మేథ మేటిక్స్-2ఏ, బోటనీ-2, సివిక్స్-2, ఒకేషనల్ థియరీ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 24,058 మంది హాజరయ్యారు. ఆర్ఐవో డాక్టర్ శ్రీని వాసులు ఏడు కేంద్రాలను, డీవీఈవో 5, డీఈసీ 4, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 26 కేంద్రాలను పరిశీలించాయి.

జన ఔషధి మందులపై అవగాహన కల్పించండి

డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (హరనాథపురం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన, తక్కువ ధరకు లభించే జన ఔషధి మందులను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత సూచించారు. జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన కార్యక్రమం జరిగింది. దీనిని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ జనరిక్ మందులపై ఎలాంటి సందేహం వద్దని, ఆ మందులు బాగా పని చేస్తాయని చెప్పారు. అన్ని రకాల వ్యాధులకు జనరిక్ మందులు లభిస్తున్నాయన్నారు. నగరంలో జనరద్దీ ఉండే ప్రాంతంలో డీసీఎంఎస్ జనరిక్ మందుల షాపు ఉండడం వల్ల ప్రజలు ఎక్కువగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రవికుమార్, డ్రగ్ కంట్రోల్ అధికారి వీరకుమార్‌రెడ్డి, ఫార్మసిస్ట్ జనార్దనరావు, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



జన ఔషధి కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత తదితరులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	92
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8262
వెండి కిలో ధర	రూ. 99,800
వెండి ఒక గ్రాము	రూ.102.80



సత్కారం..

అంనతసాగరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దారు సుభాషిణి, సీడీపీవో పద్మావతి తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

పట్టుదలతో శ్రమిస్తేనే విజయం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగాలి. పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యం. కడప జిల్లా మైదుకూరు మాది. నాన్న భూమిరెడ్డి గంగయ్య, అమ్మ లక్ష్మి. వ్యవసాయ కుటుంబం మాది. బీటెక్ పూర్తి చేసి గ్రూప్స్‌లో మొదటి ప్రయత్నంలో విఫలమైనా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రెండోసారి గ్రూప్-1లో రెండో ర్యాంకు సాధించాను. మొదటిసారి ఆత్మకూరు ఆర్డీవోగా బ్యాతలు చేపట్టాను. రెవెన్యూ సమస్యల పరిష్కారానపికి కృషి చేస్తున్నా. సక్సెస్ కావాలంటే అదృష్టాన్ని నమ్ముకో కుండా కష్టాన్ని నమ్ముకోవాలి. అనుకున్నది సాధించాలన్న పట్టు దల ఉంటే ఏదీ కష్టం కాదు. అది ఒక సాధన మార్గం మాత్రమే అవుతుంది. ఓటమి సమయంలో నేను అంతర్మధ నానికి గురయ్యాను. కానీ ఆత్మ విశ్వాసం, కుటుంబసభ్యుల తోడ్పాటు ఊరటగా నిలిచాయి.



- బి పావని, ఆర్డీవో, ఆత్మకూరు



అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విద్య, ఉపాధి మహిళల హక్కు

'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ కన్న కలలు నిజం కావాలంటే ప్రతి మహిళ ఉన్నత విద్యను అభ్యసించి, తమ కాళ్లపై తాము నిల్చునేలా ఉద్యోగం చేయాలి. మాది వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు. నాన్న ఖలీల్‌బాషా ఆర్టీసీలో ఉద్యోగి. అమ్మ ఖాజాబీ. చిన్నతనం నుంచే ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించే వారు. మైదుకూరులో డిగ్రీ వరకు చదువుకుని తిరుపతిలో ఎంబీఏ పూర్తి చేశాను. ఆ తర్వాత కర్ణాటకకు చెందిన మోహన్ సుబ్రహ్మణ్యంను మా కుటుంబసభ్యుల అంగీకారంతో వివాహం చేసుకున్నా. అప్పటి నుంచి భర్త సహకారంతో గ్రూప్స్‌కు శిక్షణ పొందాను. 2018లో గ్రూప్-1లో రాణించి ఏఈఎస్‌గా ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం సంపాదించాను. మొదటి పోస్టింగ్ ఏలూరులో విధులు నిర్వహించి అంచెలంచెలుగా పదోన్నతి పొంది ఇప్పుడు నెల్లూరు ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా పని చేస్తున్నా.

- ఆయేషా బేగం, నెల్లూరు ఐఎంఎల్ డిపో మేనేజర్



భర్త, కుమార్తెతో ఆయేషా బేగం (ఫైల్)

● **ఆత్మకూరు :** స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం సీడీపీవో సునీలత ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు జరిగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వాలు విద్య, పౌష్టికాహారం, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, పెన్షన్ తదితర సౌకర్యాలతో పాటు రిజర్వేషన్ సౌకర్యం, రక్షణ చట్టాను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం ఆమెను అంగన్‌వాడీ కార్యర్తలు, ఆయాలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

న్యూస్ బాక్స్

కాకాణి మతి భ్రమించి మాట్లాడుతున్నారు : టీడీపీ

పొదలకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల పాటు ప్రకృతి సంపదను కొల్లగొట్టి అక్రమార్జనే ధ్యేయంగా పనిచేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ప్రస్తుతం పదవి లేక మతి భ్రమించిందని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు కాకాణికి లేదన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్న కాకాణి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. నూతనంగా వేసిన సిమెంటు రోడ్డుకి ఇరువైపులా ప్రజా అవసరాల కోసం అధికారులు అనుమతులతోనే గ్రావెల్ తోలడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కోడూరు పెంచలభాస్కర్ రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, బక్కయ్యనాయుడు, దేవినేని శరత్, నెట్టెం పెంచలయ్యనాయుడు, కె.రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి

● ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి

తోటపల్లి గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలను పొందాలంటే ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మల్లికార్జునపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచనలు, జిల్లా కలెక్టరు ఆనంద్ బాబు ఆదేశాల మేరకు యానాదులకు అవసరమైన ఆధార్ నమోదుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుల జీవరత్నం గ్రామస్థులు పాల్గొన్నారు.

నూర్‌బాషాలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

తోటపల్లి గూడూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముస్లిం నూర్‌బాషాలకు శాసన మండలిలో ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించాలని తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి, ముస్లిం నూర్‌బాష సాధికారిక సమితి తిరుపతి పార్లమెంట్ కన్వీనర్ షేక్ అల్తాఫ్‌బాషా కోరారు. మండలంలోని మాచర్లవారిపాళెంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నూర్‌బాషాలకు అవకాశం కల్పించాలని తెలిపారు. 20 లక్షల మంది నూర్‌బాష, దూదేకుల కోరిక కూటమి ప్రభుత్వం తీర్చాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మనుబోలు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నెల్లూరు డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసులు వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నెల్లూరు-గూడూరు మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. మోటార్ సైకిళ్లు, ఆటోలు, ట్రక్కు ఆటోలు నిలిపి వాహన పత్రాలు పరిశీలించారు. పత్రాలు లేకుండా, హెల్మెట్ ధరించకుండా, అధిక లోడుతో వెళుతున్న వాహనాలను గుర్తించి ఎస్‌ఐ.శివరాకేష్ జరిమానాలు విధించారు. జరిమానాలు చెల్లించని వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో ఉంచారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాపూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరి కోర్టులో శనివారం నిర్వహించే మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్‌ఐ వెంకట రాజేష్ కోరారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. కోర్టు సమస్యలు త్వరగా పరిష్కరించుకోవడానికి ఇది దోహదపడుతుందని, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ఆస్తి తగాదాలు, అన్ని రకాల సివిల్ కేసులు సాధ్యమైనంత వరకు ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో పరిష్కారమవుతాయని తెలిపారు.

నూర్‌బాషాలకు చట్ట సభల్లో స్థానం కల్పించాలి

● నూర్‌బాషా సాధికార సమితి నాయకుడు ఖాదర్‌బాషా

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని నూర్‌బాషా దూదేకులు 40 సంవత్సరాలుగా పార్టీ జెండా మోస్తూ విజయా నికి కృషి చేస్తున్నారని, తమ కులానికి చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ నూర్‌బాషా సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు, కోస్తా ఆంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ బాషా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముస్లింలలో అగ్రకులాల వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తాము టీడీపీ మనుగడకు కృషి చేస్తున్నామని చెప్పారు. తదుపరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటు నూర్ బాషాలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు షేక్ సుబహాన్ బాషా, ఖాజా మస్తాన్, ఖాజా రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఇంట గెలిచి రచ్చ గెలవాలి

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హితవు ● ఉత్సాహంగా ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమానికి హాజరైన మహిళలు



వేదికపై ఎమ్మెల్యే ప్రశాంతికి ఖడ్గం బహూకరిస్తున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అయితే ముందు ఇంట గెలిచి రచ్చ గెలవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బుచ్చి రెడ్డిపాళెంలో నిర్వహించిన ముంద స్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మా ట్లాడారు. కుటుంబంలో భర్త బయట పనులు చూసుకుంటుంటే భార్య కుటుంబ సభ్యులను సమన్వయం చేసుకొంటూ అన్ని పనులు చక్కదిద్దుతూ కుటుంబానికి పెద్ద దిక్కు గా మారతుందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ఇతర మహిళా ఉద్యోగుల కోరిక మేరకు ఎన్ని పనులున్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నానన్నారు. మహిళలు విలువలతో కూడిన జీవనం సాగించాలని కోరారు. ఆత్మస్థైర్యం, లక్ష్యంతో ముందు కెళ్లే తప్పకుండా విజయం సాధిస్తారన్నారు. సీఎం చంద్రబాబు మహిళలకు పెద్ద పీట వేయడానికి తో డు తన భర్త ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అను నిత్యం ప్రోత్సహిస్తుండటంతోనే తాను కోవూరు ప్రజల కు సేవ చేయగలుగుతున్నానని తెలిపారు. కోవూరు మహిళలు ఎంతో చైతన్య వంతులని, ఈ నియోజక వర్గాన్ని అవినీతి, వివాద రహితంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానన్నారు. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడు తూ వంటింటికి పరిమితమైన తనకు తన భర్త మురళి ప్రోత్సాహంతోనే ఈ స్థాయిలో ఉండి ప్రజలకు సేవ చేస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నానన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది జక్కా శేషమ్మ ఎమ్మెల్యేకి భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందజేశారు. అనంతరం పలువురు మహిళలు ఎమ్మెల్యేని సత్కరించగా ఎమ్మెల్యే పలువురు మహిళలను సత్కరించారు. మహిళలు ఎమ్మెల్యేకు ఖడ్గం, తలపాగ బహూకరిం చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సూరా ప్రదీప, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సమాజ హితం

వెంకటాచలం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే సమాజానికి శ్రేయస్కరమని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పలువురు మహిళలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కేంద్రం విద్యాత్మక, కార్య నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులందజేస్తున్న ఏపీఎం రాధారెడ్డి

రాపూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని స్థానిక సంఘమిత్ర కార్యాలయం ఏపీఎం రాధారెడ్డి సూచించారు. పట్టణంలోని సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన సిబ్బందికి ఎంపీడీవో భవాని, సిడిపిఓ సునంద చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు

పొదలకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాచలం ప్రాజెక్టు పరిధిలో శుక్రవారం పట్టణంలోని రమణారెడ్డి కాలనీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.జ్యోతిలక్ష్మి, పద్మజ, ఆదినారాయణమ్మల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు ఆటలు పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, స్పీడ్ వాక్, లెమన్ అండ్ స్పూన్ తదితర ఆటలు నిర్వహించి. విజేతలకు శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు.

ఉపవాస ముస్లింలకు ఉపాధ్యాయుడు సహరి ఏర్పాటు



సహరి విందులో ముస్లింలు

పొదలకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉండే ముస్లింలకు పొదలకూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నౌరాజ్ తన నివాసంలో ప్రతిరోజు సహరి విందు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర ప్రయాణాల్లో ఉండే వారు, దూరప్రాంతాల్లో ఉద్యోగ విధులకు వెళ్లే వారు, తమ నివాసంలో సహరి చేసుకునే అవకాశం లేని వారి కోసం తాము ఈ కార్యక్రమం చేపట్టామని, వారి ఇంటి వద్దకే విందు పంపిస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బైలర్స్ కాలనీలో 40 మందికి సహరి విందు ఏర్పాటు చేశారు. ఈ అవకాశాన్ని ముస్లింలు వినియోగించుకోవాలని, సహరి అవసరమైన వారు 94945 80902ను సంప్రదించాలని కోరారు.

బొల్లినేని నర్సింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం



సంబరాలు చేసుకుంటున్న మహిళలు

నెల్లూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రూరల్లోని ధనలక్ష్మీపురం వద్దనున్న బొల్లినేని నర్సింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ ముందస్తు వేడుకలు నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి డీజీఎం టీ శివమాల మాట్లాడుతూ పురుషులకు ఏమాత్రం తీసిపోనివిధంగా మహిళ లు అన్నీ రంగాల్లో రాణించడం హర్షదాయకమన్నారు. వైద్య రంగంలోని మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువగా ఉంటాయని, తద్వారానే రాణించగ లుగుతున్నారని చెప్పారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, వినోల, స్రవంతి, శివశ్రీ, వినోదిని, మౌనిక, శృతి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది : ఎంపీడీవో

నెల్లూరు రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : రబీ వ్యవసాయ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే హమాలీ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దారు లాజరస్, ఎంపీడీవో శైలేంద్రకుమార్, ఏడీ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్ పాల్గొన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. దళారులకు ధాన్యం అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. రైతులందరు కొనుగోలు కేంద్రాలను సందర్శించి టోకెన్లు తీసుకోవాలని కోరారు. ఏ గ్రేడ్ ధాన్యం ధర క్వింటా రూ.2320గా నిర్ణయించినట్లు చెప్పారు.

సచివాలయ ఉద్యోగులకు తాకీదులు

నెల్లూరు(సిటీ), మార్చి 7(ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యం, అక్రమ నిర్మాణా లు. ఇతర అంశాలలో లోపాలు బట్టబయలు కావడంతో నగరంలోని 13వ డివిజన్ సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ సూర్యతేజ స్థానిక డివిజన్‌లోని గౌడ హాస్టల్, బాలాజీ నగర్, దర్గావీధి, బ్యాంకు కాలనీ, రెయిన్‌బో నగర్, గ్యాస్ గోదాము ప్రాంతాల్లో పర్యటించారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక ఉండటంపై ఆయన మండిపడ్డారు. ప్రధాన రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు, విద్యుత్ స్తంభాల నుంచి వైర్లు కిందకు వేలాడుతూ ఉండటాన్ని గుర్తించారు. శానిటేషన్ సెక్రటరీ వెంకటరత్నం, ప్లానింగ్ సెక్రటరీలు మనోజ్, రఘు, ఎమినిటీస్ సెక్రటరీ పవన్‌కు నోటీసులు జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు కుంగడంతో సదరు కాంట్రాక్టరుకు నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. అనంతరం పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నిర్మాణాలపై నూతన విధి, విధానాల మీద కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పారిశుధ్యంపై ఏడీసీ నందన్, ఎంహెచ్‌వో చైతన్య సమీక్ష నిర్వహించారు.

జగన్ ఎమ్మెల్యేకి ఎక్కువ.. సీఎంకి తక్కువ

● టీడీపీ నాయకుడు పోలూరు

నెల్లూరు రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల విమర్శలు చేయడాన్ని టీడీపీ సీనియర్ నేత, అల్లీపురానికి చెందిన పోలూరు సుబ్బయ్య తీవ్రంగా ఖండించారు. శుక్రవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. జగన్ ఎమ్మెల్యే పదవికి ఎక్కువ, సీఎం హోదాకి తక్కువన్న సంగతి తెలుసుకోవాలని సూచించారు. పవన్ కల్యాణ్ కుటుంబం ఐక్యతకు ఆదర్శవంతంగా ఉందని, జగన్ కుటుంబం ఎందులో ఆదర్శమో చెప్పాలన్నారు. నాగబాబుకు ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయమని, ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకోవాలని సీఎంను కోరుతున్నామన్నారు.

హమాలీ కార్మికుడికి నివాళి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐఎంఎల్ డిపో హమాలీ కార్మికుడు నల్లమేకల మస్తాన్‌కు తోటి కార్మికులు శుక్రవారం నివాళి అర్పించారు. డిపోలో సీఐటీయూ, హమాలీ సంఘం నాయకులు మస్తాన్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం వర్తించని అనేక మంది పేదలకు సీఎం సహాయ నిధి ఆర్థిక అండగా నిలుస్తోందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన 22 మందికి రూ.30 లక్షల నగదు చెక్కులు అందచేశారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ కిట్లు, కుర్చీల వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 30వ డివిజన్ కొత్తూరు జడ్పీ హైస్కూల్‌కు రోటరీ క్లబ్ సౌత్ సభ్యులు శుక్రవారం కుర్చీలు, క్రికెట్ కిట్లు అందజేశారు. ఆ క్లబ్ మాజీ అధ్యక్షురాలు జీ సుభద్రాదేవి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు చెట్ల కింద కూర్చొని చదువుకుంటున్నారని, ఈక్రమంలో పాఠశాలకు తమ క్లబ్ మాజీ అధ్యక్షురాలు నీరదమ్మ కుర్చీలు అందజేయడం అభినందనీయమన్నారు. 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మల్లికా బేగం, అధ్యక్షుడు శ్రీహరి, పార్థసారధి, విక్రమ్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితం సంతోషంగా గడపాలి : ఎస్పీ కృష్ణకాంత్



వీడ్కోలు సభలో ఎస్పీ, పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. పోలీసు శాఖలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్‌ఐ యుగంధర్, ఏఆర్ హెచ్‌సీ కేవీ శేషయ్యకు శుక్రవారం రాత్రి ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో వీడ్కోలు సభ నిర్వహించారు. ఎస్పీ పాల్గొని పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, మునిరాజా, డీఎస్పీలు శ్రీనివాసరావు, సింధు ప్రియ, చంద్రమోహన్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

నాటుసారా తయారీదారులకు బెల్లం అందకూడదు : ఎక్సైజ్ ఏసీ, ఈఎస్



బెల్లం వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీదారులకు ముడి పదార్థమైన బెల్లం అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బెల్లం వ్యాపారులకు సూచించారు. నెల్లూరు బీవీనగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నగరంలోని బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ ఏసీ దయాసాగర్, ఈఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకేసారి 10 కిలోల కంటే ఎక్కువగా బెల్లం కొన్న వారి వివరాలు, ఆధార్ కార్డును తప్పనిసరిగా బెల్లం వ్యాపారులు తీసుకోవాలని, అనుమానిత వ్యక్తులకు బెల్లం అమ్మకూడదని ఆదేశించారు. బెల్లం నిల్వ, లావాదేవీల వివరాలు క్రమం తప్పకుండా ఎక్సైజ్ శాఖకు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీ.రమేష్‌బాబు, ఎస్‌ఐ ఎస్.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం మృతి రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 25 నుంచి 30 ఏళ్లలోపు యువకుడు మృతి చెందాడు. మృతదేహంపై పసుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగు రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. కుడిచేతిపై అమ్మ, సంజీవమ్మ అని పచ్చబొట్లు ఉన్నాయి. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి మహిళ మృతి

పొదలకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గేదెలను తోలుకొని చెరువులోకి వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలో ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని నల్లపాలెంకు చెందిన తురకా నారాయణమ్మ రోజులాగే గురువారం పశువులను మేతకు తాటిపర్తి చెరువులోకి తోలుకెళ్లింది. అక్కడ ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి మృతి చెందింది. బంధువులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలికి భర్త, కుమారు డు, కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హనీఫ్ తెలిపారు.

సీఎంవో నుంచి వచ్చానంటూ మోసం

● కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లి రూ.50 వేలు దోచేశాడు

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి వచ్చామని చెప్పి ఓ వ్యక్తి దంపతులను నమ్మించి రూ.50 వేలు తీసుకుని పరారయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... రాపూరు మండలం తెగచర్లకు చెందిన జయమ్మ, పెద్దయ్య దంపతుల కుమారుడు సింహాద్రి, వారి బంధువు పవన్ హోటల్‌లో ఉద్యోగం కోసం మలేసియా వెళ్లారు. ఏజెంట్ మోసం వల్ల వీసా గడువు ముగియడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై ఈనెల 3న తల్లిదండ్రులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆ విషయం అన్ని పత్రికల్లో వచ్చింది. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి తాను సీఎం కార్యాలయం నుంచి వచ్చానంటూ జయమ్మ, పెద్దయ్యను కలిశాడు. కలెక్టర్ కార్యాలయానికి వస్తే కలెక్టర్‌తో మాట్లాడి మీ పిల్లలను తీసుకువస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మిన తల్లిదండ్రులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయం బయట వారిని కూర్చోబెట్టి కలెక్టర్‌తో మాట్లాడి వస్తానని లోపలికివెళ్లాడు. కొద్ది సేపటికి తిరిగివచ్చి అన్నీ మాట్లాడేశానని, సింహాద్రి, పవన్‌ను తీసుకొచ్చేందుకు విమానం టికెట్లు, ఇతర ఖర్చులకు రూ.60 వేల వరకు పెట్టుకోవాలని చెప్పాడు. అంత ఇచ్చుకోలేమని తల్లిదండ్రులు రూ.50 వేలు ఇచ్చారు. ఆ నగదు తీసుకున్న వ్యక్తి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో పెద్దయ్య అతని ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బాధితులు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులపై దాడి

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): దంపతులపై దాడి చేసిన వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నజీర్‌తోటకు చెందిన దామోదర్‌రావుకు తోడల్లుడు కోటేశ్వరరావుకు ఆస్తి విషయంలో మనస్పర్థలున్నాయి. శుక్రవారం దామోదర్‌రావు అతని భార్యపై కోటేశ్వరరావు, అతని బంధువులు రాళ్లతో దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

రైసుమిల్లు యజమానిపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పంట వీధికి చెందిన పందాపాటి పవన్‌కుమార్‌రెడ్డి వద్ద వరి ధాన్యం తీసుకొని డబ్బు ఇవ్వలేదన్న ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని యనమలపాలెం వద్ద ఉన్న శ్రీ సాయిబాబా రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లు యజమాని శ్రీరాం శేఖర్‌బాబు పవన్‌కుమార్‌రెడ్డి వద్ద రూ.8.31 లక్షల విలువ చేసే వరి ధాన్యం కొనుగోలు చేశారు. అయితే నగదు చెల్లించకపోవడంతో బాధితుడు శుక్రవారం శ్రీరాం శేఖర్‌బాబుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మోసం కేసు రిజిస్టర్ చేశారు.

సక్సెస్ ఈజ్ రివేంజ్

మహిళలు సెల్ఫ్ రెస్పెక్ట్ లేకుంటే తమను తాము కోల్పోతారు. ధైర్యంగా ఉంటే తమను తాము రక్షించుకుంటూ ఏ రంగంలో అయినా రాణించగలుగుతారు. తెలంగాణలోని యాదాద్రి మాది. నాన్న లింగారెడ్డి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో నా చదువు అంతా హైదరాబాదులోనే సాగింది. అమ్మ వనజ గృహిణి. ఉన్నత స్థానంలో ఉంటేనే మహిళకు ప్రత్యేక గౌరవం ఉంటుందని చెబుతూ పెంచారు. బీటెక్ పూర్తి చేసి తొలుత ఓ ప్రైవేటు కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేశా. 2018 నుంచి ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా అడుగులు వేశాను. సీడీపీవో ఉద్యోగం సాధించి ఆ తర్వాత గ్రూప్ పరీక్షలు రాస్తూ వచ్చాను. 2022లో ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన గ్రూప్ పరీక్షల్లో 6వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాను. గుంటూరు జిల్లాకు చెందిన హైకోర్టు అడ్వకేట్ కల్యాణ్ చక్రవర్తితో పెళ్లి అయ్యింది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో డీఎస్పీ ఉద్యోగం సాధించాను. రెండేళ్ల ట్రైనింగ్‌లో నా భర్త అందించిన సహకారం మరువలేనిది. ఇప్పటికీ నా ఉద్యోగం నేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నానంటే అందుకు ఆయనే కారణం. మహిళలను ఎవరైనా అవమానిస్తే మనం గొప్పగా ఎదిగి చూపితే వారికి నిద్ర కూడా పట్టదు. అదే మన సక్సెస్. ప్రతి మహిళ ఉన్నత చదువులు చదువుకోవడంతోపాటు మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలి.

- పి సింధుప్రియ, నెల్లూరు నగర డీఎస్పీ



కుటుంబ సభ్యులతో డీఎస్పీ సింధుప్రియ(ఫైల్)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విద్యతోనే ఆడవాళ్లకు సాధికారత



విద్యతోనే ఆడవాళ్లకు సాధికారత సాధ్యమని నేను నమ్ముతాను. విద్యతోనే అవగాహన, అవకాశాలు, హక్కులు, స్వేచ్ఛ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో తెలుసుకోగలం. అప్పుడే బాధ్యతాయుతంగా మెలుగుతారు. అదేవిధంగా సొంత నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఈరోజు ఈస్థాయిలో ఉన్నానంటే దానికి కారణం చదువని బలంగా నమ్ముతాను. కష్టపడి చదువుకున్నాను కాబట్టే వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, వృత్తిపరంగా సంతోషంగా జీవించగలుగుతున్నా. కుటుంబ బాధ్యతల ను ఇద్దరం చూసుకుంటున్నాం. వృత్తిరీత్యా ఎక్కువ సమయం కుటుంబ సభ్యులతో గడపలేకపోతున్నప్పటికీ సమయం దొరికినప్పుడు కుటుంబమే లోకం. ముఖ్యంగా మావారు నన్ను బాగా అర్థం చేసుకుంటారు. ఆయన సహకారంతోనే సంతృప్తికరమైన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. వృత్తిగతంగా నిజాయితీగా పనిచేయడం, అందరి సహకారంతో లక్ష్యాలను పూర్తిచేసేందుకు నూరుశాతం ప్రయత్నిస్తూ విజయం సాధిస్తున్నాను. సాంకేతికపరమైన సమస్యలు ఎదురైతే వాటిని దాచి పెట్టను. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నా. అందరి పనితీరు ఒకేలా ఉండదు కాబట్టి అర్థం చేసుకుంటూ పని గురించి అవగాహన కల్పిస్తూ, నేను నేర్చుకుంటూ లక్ష్యాలను చేరుకుంటున్నా.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కోవూరు ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ మంత్రి లోకేష్ మంగళగిరిలో చేనేతల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపచేయాలని విజ్ఞప్తి చేశారు. నేతన్నలను ఆర్థికంగా ఆదుకునే చేనేత సహకార సొసైటీలు రాష్ట్ర వ్యాప్తం గా 45 ఏర్పాటుకాగా కోవూరు నియోజకవర్గంలో మూడు ఉన్నాయని చెప్పారు. వాటికి ముడిసరుకు, మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. చేనేత రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి కోవూరు ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. చేనేత భవనానికి సంబంధించిన స్థలం ఆక్రమణకు గురైఉందని, దాన్ని అక్రమార్కుల చెర నుంచి విడిపించి కోవూరు నియోజక వర్గంలో చేనేత భవనం నిర్మించాలని అభ్యర్థించారు. రాష్ట్ర చేనేత శాఖ మంత్రి సవిత సమాధానమిస్తూ హామీలకు సంబంధించి అతి త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులకు ఎన్‌హెచ్‌డీసీ ద్వారా సబ్సిడీ రుణాలతోపాటు 50 సంవత్సరాలకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సదుపాయం కలిపించినట్లు వివరించారు. కాగా, సెమీ అర్బన్ ప్రాంతమైన కోవూరు నియోజకవర్గాన్ని టిడ్కో పరిధిలో చేర్చాలని ప్రశాంతి రెడ్డి అసెంబ్లీ లో కోరారు. ప్రస్తుతం నుడా పరిధిలో ఉందని దానిని టిడ్కో పరిధిలోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ మోడల్ పరీక్షలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీహర్ష వాల్మీకి కోచింగ్ సెంటర్‌లో ఎస్ఎస్ పబ్లికేషన్స్ సహకారంతో ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ఉచితంగా డీఎస్సీ మెడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎం హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలను కూడా ప్రతి మంగళవారం, ఆదివారం ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు.

నెల్లూరు (జడ్పీ), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వర పురం సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీగిరిజన కాలనీలో విద్యుత్ లైన్ల మరమ్మ తుల కారణంగా వెంకటేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఆర్‌డీఏ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కారణంగా సండే మార్కెట్, బృందావనం, ట్రంకురోడ్డు, పొగతోట, మంగలివీధి, కాంప్లెక్స్ రోడ్డు, ఏసీఎన్ బిల్డింగ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే ఎంజీ నగర్ సబ్‌స్టేసన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా జేవీఆర్ కాలనీ, సుజాతమ్మ కాలనీ, ఆదర్శ్ నగర్, జిల్లా జడ్జి బంగ్లా, పొదలకూరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రంగనాథం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కోసం ఇసుక డొంక, రంగనాయకులపేట, కపాడిపాళెం, సంతపేట, రైల్వే ఫీడర్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాముూరు నుంచి తిరుపతికి బస్సు నడపాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), (ఆంధ్రజ్యోతి) : పాముూరు నుంచి తిరుపతి, చెన్నైకు బస్సులు నడపాలని పాముూరుకు చెందిన ఎన్ నరసిం హారావు ఆర్టీసీ డీఎంను కోరారు. ఆర్టీసీ నెల్లూరు-2 డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ నిర్వహించారు. ఐదుగురు ఫోన్ చేసి సమస్యలు తెలిపారు. కొండాపురం నుంచి కలిగిరికి ఉదయం 9 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని, నారికేళపల్లి నుంచి నెల్లూరు నగరానికి 3.45 గంటలకు బస్సు వేయాలని, ఇందుకూరు పేట నుంచి నెల్లూరుకు ఉదయం 9 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని, నెల్లూరు నుంచి గంగపట్నానికి ఇందుకూరు పేట మీదుగా బస్సులు నడపాలని కోరారు. స్పందించిన డీఎం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మహిళా అధ్యాపకులకు బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్ గిరి

డీకేడబ్ల్యూ కళాశాలలో మహిళా దినోత్సవం

నెల్లూరు(విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ నేటి సమా జంలో మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సొంతం చేసుకుం టున్నారన్నారు. అనంతరం మహిళా అధ్యాపకులకు పలు రకాల పోటీలు నిర్వ హించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం విజయలక్ష్మి, ప్యూర్ స్మైల్ ఫౌండేషన్ అధినేత్రి పర్వీన్, కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ డాక్టర్ విజయకళ, సభ్యులు డాక్టర్ కళాప్రియ, డాక్టర్ లలితకుమారి, తమన్నా, గీత, డాక్టర్ శ్రీరంజని, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో, ఉద్యోగినులకు సన్మానం

నెల్లూరు (వైద్యం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతను, ఆ శాఖలోని మహిళా ఉద్యోగులను ప్రత్యేకంగా సన్మానించింది. హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు, కార్యదర్శి కమల్ కిరణ్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మహిళలకు శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. సుధాకర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా వారి వెంటే ఉండి పోరాడుతామని చెప్పారు. మహిళా కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం, డీపీఎంవో డాక్టర్ రమేష్, జిల్లా స్టాటిస్టికల్ అధికారి సహన, ఎన్ఆర్‌సీ నోడల్ అధికారి శివరాముడు, జిల్లా ఎపిడమిక్ అధికారి డాక్టర్ భాస్కర్, శ్రీనివాసులు, ఏపీ హంస కోశాధికారి మజార్, గౌరవ సలహాదారులు అరవ పరిమళ, జిల్లా ఉపాధ్యక్షులు మురళి, నాగరాజు, జిల్లా మహిళా వింగ్ కార్యదర్శి సుకన్య పాల్గొన్నారు.

'సూక్ష్మ' శుభాకాంక్షలు



మర్రి ఆకుపై మహిళా రూపు చిత్రం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా దినోత్సవం సందర్భంగా జయహో మహిళ అని కీర్తిస్తూ సూక్ష్మ చిత్రకళాకారులు తమ చిత్రాల ద్వారా శుభాకాంక్షలు అందజేశారు. భక్తవత్సలనగర్‌కు చెందిన ఎం శ్రీనివాసులు కందులు, పచ్చిశెనగలు, నల్ల బియ్యం, ఆవాలు, మిరియాలు, పెసరపప్పు తదితరాలతో ధాన్యలక్ష్మీ రూపును కళాత్మకంగా తీర్చిదిద్దారు. నగరంలోని సుంకు చెంగన్న పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న గంధవళ్ల ఉమాశంకర్ మర్రి ఆకుపై మహిళా చిత్రాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు.



సన్మానం పొందిన డీఎంహెచ్‌వో సుజాత, మహిళా ఉద్యోగులు



పురస్కారాలతో నర్సింగ్ విద్యార్థులు

నారాయణ నర్సింగ్ కళాశాలలో వేడుకలు

నెల్లూరు (వైద్యం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన నర్సింగ్ విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు, బహుమతులు అందజేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచారకుడు హరికృష్ణ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక, విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం మహిళలకు తోడుగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల డీన్ డాక్టర్ వనజ కుమారి, సీడబ్ల్యూసీ ఛైర్మన్ మాధవి, ప్రభుత్వ న్యాయ వాది రమాదేవి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండా రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ భవనలో మహిళా దినోత్సవం

నెల్లూరు (జడ్పీ), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విద్యుత్ భవన్‌లో మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలు శుక్రవారం జరిపారు. ఉద్యోగినులకు వంటల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారికి మరింత సహకారాన్ని అందించాల్సిన అవసరం ఉంద న్నారు. కార్యక్రమంలో ఈఈలు బాల చంద్ర, శ్రీధర్, సోమ శేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ విజిత పాల్గొన్నారు.



వంటలు రుచి చూస్తున్న ఎస్ఈ విజయన్

ఆకాశమే ఆమె హద్దు

రాకెట్‌లా దూసుకువెళ్తున్న తెలుగు మహిళలు

అంతరిక్ష రంగంలోనూ కీలక భూమిక

ఇస్రో ఉపగ్రహ ప్రయోగాల్లో సత్తా

Women's Day



చందమామ రావే..జాబిల్లి రావే అంటూ అమ్మ గోరుముద్దలను తినిపించేది. ఆకాశంలో వెలిగిపోయే చంద్రుడ్ని చూపించేది. అయితే ఇప్పుడు ఆ చందమామనే చేరుకుందామంటున్నారు మన మహిళామూర్తులు. ఔను..ఇస్రో చంద్రయాన్-3 ప్రాజెక్ట్‌లో పురుషులకు దీటుగా భాగస్వాములై సత్తా చాటుకున్నారు. తాము అడుగుపెట్టని రంగమే లేదని నిరూపించుకున్నారు. సైన్స్ అన్నా సై అంటున్నారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నారు ఇస్రోలోని మహిళా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు. వీరి ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఇస్రోలో ముఖ్య భూమిక పోషిస్తున్న ముగ్గురు తెలుగు మహిళల పరిచయం...

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఉపగ్రహాల రూప'కల్పన'



పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన కాళహస్తి కల్పనకు చిన్నప్పటి నుంచే అంతరిక్ష రంగంపై ఆసక్తి. ఆ దిశగానే కెరీర్‌ను మలచుకున్నారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి కావడంతో విద్యాభ్యాసమంతా చెన్నైలో సాగింది. తల్లి ఇందిర గృహిణి. చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయంలో కల్పన ఇంజినీరింగ్ చదివారు. అదే సమయంలో ఇస్రోలో ఇంజినీరింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడటంతో ఆమె కల సాకారానికి తొలి అడుగు పడింది. 2000లో శ్రీహరికోట ఇస్రోలో రాడార్ ఇంజినీర్‌గా ఎంపికై వడివడిగా శాస్త్రవేత్తగా ఎదిగారు. ఐదేళ్లపాటు పనిచేశాక బెంగళూరు ఉపగ్రహ కేంద్రానికి బదిలీ అయ్యారు. అక్కడే శాటిలైట్ సిస్టమ్స్ ఇంజనీర్‌గా అనుభవం సంపాదించారు. ప్రాజెక్టు అసోసియేట్ డైరెక్టర్‌గా ఆరు ఉపగ్రహాల రూపకల్పనలో పాలుపంచుకున్నారు. చంద్రయాన్-3 వంటి కీలక ప్రాజెక్టులో అసోసియేట్ డైరెక్టర్‌గా బాధ్యత వహించారు. చంద్రయాన్-2లో కూడా కల్పన కీలక పాత్ర పోషించారు. రాడార్ ఇంజినీర్‌గా అడుగుపెట్టి విశేష కృషితో నేడు ఉపగ్రహాల తయారీలో ముఖ్య పాత్ర పోషించే స్థాయికి ఎదిగారు.

ఉమా..ప్రతిభకు చిరునామా



గొట్టిముక్కల ఉమాదేవి.. చిరుద్యోగిగా కెరీర్‌లో అడుగుపెట్టి అసాధారణ ప్రతిభతో ఉన్నతస్థాయికి దూసుకువెళ్లారు. హైదరాబాదులోనే పుట్టి పెరిగారు. మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తవ్వగానే నేషనల్ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ సెంటర్(హైదరాబాద్)లో సాధారణ ఉద్యోగిగా చేరారు. 1988లో భారతీయ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల కోసం కొత్త గ్రౌండ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరగడం ఉమాదేవికి కలిసొచ్చింది. ఎన్‌ఆర్‌ఎస్‌సీలో అనుభవంతో గ్రౌండ్‌స్టేషన్‌లోని శాటిలైట్ డేటా విభాగంలో సీనియర్ ఉద్యోగిగా చేరారు. ఆమెలోని ప్రతిభకు,చొరవకు ఇస్రో సీనియర్ అధికారుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ తత్వమే ఆమెను కొత్త ఆవిష్కరణల్లో భాగస్వామిని చేసింది. విజయాల నమోదుకు కారణమైంది. ఉన్నతంగా ఆలోచించే ఉమాదేవి భూటాన్‌లో ఇస్రో కొత్తగా స్థాపించిన గ్రౌండ్ స్టేషన్‌కు సారథ్య బాధ్యతలు చేపట్టారు. ఈమె తండ్రి గోపాలరావు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వద్ద సీఏస్‌గా పనిచేశారు. తల్లి లక్ష్మీబాయ్ గృహిణి.

సెన్సార్ సాంకేతికతలో 'విజయ' ప్రస్థానం



యంద్రపల్లి విజయ.. పట్టుదలకు కేరాఫ్‌గా నిలిచే ఈ తెలుగుబిడ్డ కృష్ణాజిల్లా ముదునూరులో సామాన్య కుటుంబంలో పుట్టారు. తండ్రి గంగాధర్ కోపరేటివ్ బ్యాంకులో సాధారణ ఉద్యోగి. తల్లి వెంకటరత్నం గృహిణి. విజయవాడలోని పటమట ప్రభుత్వ పాఠశాలలో విజయ పదోతరగతి వరకూ చదివారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల(విజయవాడ)లో ఇంజనీరింగ్ చదివారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీజీలో సీటొచ్చింది. చేరిన నెల రోజులకే అనూహ్యంగా ఇస్రోలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఐఐటీ సీటు వదులుకోవడం బాధనిపించినా అంతరిక్షరంగంపై మక్కువ ఆకర్షించింది. బెంగళూరులోని సెన్సార్లు తయారయ్యే ఇస్రో ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్‌లో చేరారు. తొలినాళ్లలోనే ప్రతిభ చాటుకున్నారు. ఆమె నేతృత్వంలో రూపొందించిన సెన్సార్‌ను ప్రప్రథమంగా పీఎస్ఎల్వీ ప్రాజెక్టుకు వినియోగించారు. అనంతరం మరో క్లిష్టమైన స్టార్ సెన్సార్ తయారీలో సఫలీకృతమయ్యారు. ఓషన్‌శాట్-3, జీశాట్, రీశాట్ సిరీస్‌లో కొత్త ఉపగ్రహాల్లో ఈ సాంకేతికతను వినియోగించారు. మైక్రోశాట్‌లో తక్కువ బరువుతో స్టార్ సెన్సార్‌ను రూపొందించి విస్మయపరిచారు. ఇదే సెన్సార్‌ను చంద్రయాన్-3లోనే కాదు గగన్‌యాన్‌కు కూడా ఉపయోగించారు. ఈమె గగన్‌యాన్ ప్రాజెక్టుకు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఇస్రోలో పురుషులకు దీటుగా అవకాశాలను అందిపుచ్చుకుని కీలకమైన సెన్సార్ విభాగంలోనూ విజయ తనదైన ముద్ర వేసుకుంటున్నారు.

అత్తను చంపిన అల్లుడు

- నగదు, నగల కోసం తిరుపతిలో కిరాతకం

6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : 6.25

సహరి (ఆదివారం) : 5.06

కూలీలపైకి దూసుకెళ్లిన మినీ లారీ

- హైవే డివైడర్ వద్ద గ్రీనరీ పనులు చేస్తున్న ఇద్దరి దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- మృతులది పెళ్లకూరు మండలం భీమవరం

ఇక నిఘా నీడలో నగరం

తిరుపతి, మార్చి7(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఏమి జరిగినా తెలిసేలా అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కోసం నగరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్న ప్రాంతాలను శుక్రవారం స్మార్ట్ సిటీ, నగరపాలక సంస్థ, పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు.పలు మార్పులను అధికారులకు సూచించారు. మౌర్య మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా అసాంఘిక శక్తులను, పారిశుధ్య పనులను, ఆక్రమణలను, నేరాలను సులువుగా గుర్తించవచ్చునని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఈఈ.రవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

మౌర్య ఐఏఎస్

డిగ్రీ తర్వాత ఐదేళ్ల శ్రమ ఫలితం ఈ హోదా. సివిల్స్ ప్రయత్నంలో నాలుగుసార్లు అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోయాయి. ప్రతి వైఫల్యమూ ఒక కొత్త పాఠమే నేర్పింది. చిన్నవయసులో నాన్న చెప్పిన మాటలే లక్ష్యంవైపు నడిచేందుకు స్ఫూర్తిని రగిలించాయి. ఐదో ప్రయత్నంలో 100వ ర్యాంకు సాధించారు మౌర్య. ప్రస్తుతం తిరుపతి నగర కమిషనర్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంశలే అందుకున్నారు. మౌర్య సొంతూరు ప్రొద్దుటూరు సమీపంలోని నాగులపల్లె. మౌర్య పుట్టకముందు ఆ ఊరుకి నీటి సమస్య ఉండేది. ఊళ్లో నీళ్లట్యాంకు నిర్మిస్తే పరిష్కారం అవుతుందని తెలుసు. ఎన్నో విన్నపాలు చేసుకునేవారు. ఒక కలెక్టర్ చొరవతో చిటికెలో ట్యాంకు మంజూరైంది. ఈ ఉదంతాన్ని ఆ ఊరికి సర్పంచ్‌గా ఉన్న వాళ్ల నాన్న చంద్ర ఓబుళ రెడ్డి మౌర్యకు చెప్పేవారు. కలెక్టర్‌ను దేవుడితో పోల్చేవారు. ఆ తర్వాత ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్రప్రసాద్ గురించి సినిమా కథలా చెప్పుకుంటుంటే వాటి ద్వారా మౌర్య ప్రేరణ పొందారు. బీటెక్ పూర్తిచేసిన తర్వాత గ్రామీణాభివృద్ధిపై పీజీ డిప్లొమా కోర్సు చేసి సివిల్స్‌వైపు దృష్టిపెట్టారు. ఐఏఎస్ అధికారిగా మహిళలకు ఒక భరోసాగా మౌర్య నిలుస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గైడెన్స్, వ్యూహం, సబ్జెక్ట్ ఎంపిక సక్రమంగా ఉంటే సివిల్స్ లక్ష్యం సాధించవచ్చు. ఇవి సరిగ్గాలేక నాలుగేళ్ల పాటు నేను చివరివరకూ వచ్చి చేజార్చుకున్నాను. పెళ్లి చేసేయమని సమాజం నుంచి ఒత్తిడి వచ్చినా తల్లిదండ్రులు నన్ను అర్థం చేసుకున్నారు. అండగా నిలిచారు. లక్ష్యం సాధించాను. ఇప్పుడు నా భర్త సహకారం తోడైంది. అమ్మాయిల ఇష్టాయిష్టాలు తెలుసుకుని కుటుంబం వ్యవహరించాలి

మహిళా దినోత్సవం

శ్రీసిటీలో దేశ, విదేశాలకు చెందిన 235 సంస్థల్లో 65 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుంటే, ఇందులో 34 వేల మంది మహిళలే ఉండడం తిరుపతి జిల్లాలోని ఈ ఆర్థిక మండలి ప్రత్యేకత. ఈ సంస్థల్లో ఏటా రూ. లక్ష కోట్లకు పైగా విలువైన ఉత్పత్తులు తయారవుతుండగా, ఇందులో ఆడవాళ్ల శ్రమ వాటా రూ. 60 వేల కోట్లకు పైగానే కావడం జిల్లాకే గర్వకారణం. శ్రీసిటీ నుంచి ఎగుమతుల విలువే రూ. 57 వేల కోట్లు.



స్త్రీ సిరుల సిటీ

ఆడవాళ్లే అధికం

ఆంధ్రజ్యోతి బ్యూరో, తిరుపతి

శ్రీసిటీలో దేశీయ కంపెనీలతో పాటూ అమెరికా, యూకే, జర్మనీ, చైనా, సింగపూర్, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్ ఆస్ట్రేలియా, బెల్జియం తదితర 30 దేశాలకు చెందిన సంస్థలు వున్నాయి. శ్రీసిటీలోని ప్రతి పరిశ్రమలోనూ మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రత్యేకించి కొన్ని సంస్థల్లో అయితే 80 నుంచీ 90 శాతం ఉద్యోగులు మహిళలే వుండడం విశేషం. ఉదాహరణకు ఎవర్టైన్ టీ కంపెనీలో 97 శాతం, జెన్ లెనిన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 90 శాతం, ఎమ్మెస్సార్ గార్మెంట్స్‌లో 80 శాతం, హావెల్స్ (లాయిడ్ ఏసీ)లో 60 శాతం, బ్లూస్టార్‌లో 50 శాతం డైకిన్‌లో 40 శాతం మహిళా ఉద్యోగులు వున్నారు. అన్నింటికన్నా విశేషం ఏమిటంటే ఈ పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తున్నవారిలో 90 శాతం మంది జిల్లా వాసులే కావడం. అందులోనూ సత్యవేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ. పారిశుద్ధ్య కార్మికుల నుంచీ సెక్యూరిటీ గార్డుల వరకూ... ఆఫీస్ అసిస్టెంట్ నుంచీ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌ల వరకూ... టెక్నికల్ ఆపరేటర్ల నుంచీ సూపర్‌వైజర్లు, మేనేజర్లు, మెయింటెనెన్స్ ఇంజనీర్ల వరకూ... చివరికి మెటీరియల్ లోడింగ్ అన్ లోడింగ్ నుంచీ ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ వంటి అరుదైన విధుల దాకా అన్ని విభాగాల్లోనూ మహిళా ఉద్యోగులు మగవారితో పోటీ పడి పనిచేస్తున్నారు. కాల్గేట్ టూత్ బ్రష్‌ల తయారీ మొదలు ఆల్‌స్ట్రమ్ మెట్రో రైళ్ళ తయారీ దాకా మహిళల పాత్ర అధికంగా వుంది. మన జిల్లా మహిళల చేతుల మీదుగా జరుగుతున్న ఈ ఉత్పత్తులు దేశీయంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక అభివృద్ధి చెందిన దేశాల ప్రజలకు చేరుతుండడం విశేషం. నిజానికి ఇక్కడ పనిచేస్తున్న స్థానిక మహిళల్లో పెద్దగా చదువుకున్నవారు తక్కువ. నాలుగైదు తరగతులు చదువుకున్న వారికి కూడా శ్రీసిటీలో ఉపాధి లభిస్తోంది. అందుకు అవసరమైన శిక్షణ ఇక్కడ ఇస్తుండడమే కారణం.



ఖయాల్బీ ఇప్పుడు కూలీ కాదు

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన పోలూరు ఖయాల్బీ పదవ తరగతి ఫెయిల్ అయింది. ఎలాంటి ఆస్తిపాస్తులూ లేకపోవడంతో పెళ్ళయ్యాక భర్తతో కలసి కూలి పనులకు వెళ్ళేది. శ్రీసిటీలోని ఎమ్మెస్సార్ గార్మెంట్స్‌లో ఖయాల్బీ పనిచేస్తోంది. ఇపుడామె నెల జీతం రూ. 25 వేలు. గతంలో కూలి పనులకు వెళ్ళిన ఆమె ఇపుడు గర్వంగా తాను శ్రీసిటీ ఉద్యోగినని చెబుతున్నారు.



తల్లిని పోషిస్తున్న గీత

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన రాజేశ్ గీత. ఏడవ తరగతి వరకే చదువుకుంది. భర్త మరణించాడు. పిల్లలు లేరు. తాను బతుకుతూ తల్లిని కూడా పోషించాల్సిన బాధ్యత పైన పడింది. కూలి పనులు చేసే ఆమె, గార్మెంట్స్‌లో చేరి నెలకు రూ. 18 వేలు సంపాదిస్తున్నారు.



తండ్రికి చేదోడుగా కనక

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన కనక బీకాం చదువుతూ మధ్యలో ఆపేసింది. గార్మెంట్స్ పరిశ్రమలో ఏడేళ్ళుగా క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తున్న కనక ఇపుడు నెలకు రూ. 22 వేలు సంపాదిస్తోంది. తల్లిదండ్రులకు చేదోడుగా వుంటూ తమ్ముళ్ళను చదివిస్తోంది.



అరుదైన విధుల్లో ఆడవాళ్లు

శ్రీసిటీలోని జెన్ లెనిన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఫోమ్ వుపయోగించి కుషన్‌తో కూడిన దిండ్లు, దుప్పట్లు వంటివి తయారు చేస్తారు. ఈ పరిశ్రమలో పలువురు మహిళలు అరుదైన విధులు నిర్వర్తిస్తూ కనిపించారు. వారిలో ఒకరు సత్యవేడు మండలం మాదరపాకం గ్రామానికి చెందిన బాబూ పూర్ణిమ. బిఎస్సీ కంప్యూటర్స్ చదువుతూ మధ్యలో చదువు మానేసిన ఈమెకు భర్త, ముగ్గురు ఆడపిల్లలు వున్నారు. ఏడాదిన్నర కిందట జెన్ లెనిన్ పరిశ్రమలో చేరిన పూర్ణిమ ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా క్రేన్ తరహా వాహనాలు నడుపుతూ మెటీరియల్‌ను తరలించే విధులను అవలీలగా నిర్వర్తిస్తున్నారు.



గట్టున పడ్డ గంగమ్మ

వరదయ్యపాలెం మండలం మోపురుపల్లికి చెందిన గంగమ్మకి భూములూ, ఆస్తులూ లేవు. భర్త హమాలీగా బరువులెత్తే పనులకు వెళితే ఈమె వ్యవసాయ కూలీగా పొలాలకు వెళ్ళేది. ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకున్నా ఇల్లు గడవడం కష్టమయ్యేది. అయితే శ్రీసిటీలోని పరిశ్రమలో చేరడం ఆమె బతుకును మలుపు తిప్పింది. ఐదవ తరగతి వరకే చదువుకున్న గంగమ్మ ఇప్పుడు నెలకు రూ. 18 వేలు జీతం తీసుకుంటోంది. కొడుకులను ఇంజనీరింగ్, డిగ్రీ చదివించగలుగుతోంది.



కూలీలపైకి దూసుకెళ్లిన మినీ లారీ

- హైవే డివైడర్ వద్ద సుందరీకరణ పనులు చేస్తున్న ఇద్దరి దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు



లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన తిరుపాల్‌ను పట్టుకొని రోదిస్తున్న మహిళ



రమణమ్మ తిరుపాలు (ఫైల్ ఫొటోలు)



లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన రమణమ్మ

రేణిగుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలోని హైవే వంతెనపై శుక్రవారం మధ్యాహ్నం ఓ గూడ్స్ మినీ లారీ అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొని.. అటువైపు రోడ్డులోకి దిగి గ్రీనరీ పనులు చేస్తున్న కూలీపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు ఇక్కడి పోలీస్ స్టేషన్ సమీపంలోని హైవే వంతెనపై ఉన్న డివైడర్లకు గ్రీనరీ పనులు చేస్తున్నారు. విమానాశ్రయం సమీపంలోని ఓ కంపెనీకి పాండిచ్చేరి నుంచి మిషన్ విడిభాగాలను తీసుకొస్తున్న మినీ గూడ్స్ లారీ వంతెనపై అతివేగంగా రావడంతో అదుపుతప్పింది. రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొడుతూ ఆ పక్క రోడ్డులోకి దూసుకుపోయింది. అక్కడ గ్రీనరీ పనులు చేస్తున్న కూలీలను ఢీకొని.. వంద మీటర్లు లాక్కొని పోవడంతో రమణమ్మ (53) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన తిరుపాల్, సక్కమ్మ, శైలజ, సరోజమ్మను చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తిరుపాల్ (63) మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవరు సంఘటన స్థలం నుంచి పరారయ్యాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

భీమవరంలో విషాదం

పెళ్లకూరు, ఆంధ్రజోతి: గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలో జరిగిన ఘటనలో ఇద్దరు కూలీలు మృతి చెందడంతో పెళ్లకూరు మండలం నెలబల్లి పంచాయతీ భీమవరం దళితవాడలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలో రబీలో వ్యవసాయ పనులు ముగియడంతో జాతీయ రహదారి డివైడర్ మధ్యలో మొక్కలు నాటే సుందరీకరణ పనులకు కొంతకాలంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో కట్ల రమణమ్మ, దామతోటి తిరుపాల్ మృతి చెందారు. వీరంతా నిరుపేద కుటుంబీకులే. రమణమ్మ భర్త రెండేళ్ల కిందట మృతిచెందాడు. దీంతో కూలీ పనులకు వెళ్లి తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారామె. కూలికి వెళ్తేనే వీళ్లకు పూట గడిచేది. ఇక, సూళ్లూరుపేట మండలం వెలగల పొన్నూరుకు చెందిన తిరుపాల్, ఐదేళ్ల కిందట తన భార్య నాగరాజమ్మ స్వగ్రామమైన భీమవరం వచ్చారు. భార్యతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి మృతితో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

అత్తను చంపిన అల్లుడు

- నగదు, నగల కోసం కిరాతకం
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు



హత్యకు గురైన ప్రమీలమ్మ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగదు, నగల కోసం అత్తను హతమార్చాడు. ఈ ఘటన తిరుపతి నగరం కోలావీధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వెస్ట్ పోలీసుల కథనం మేరకు.. ఎర్రావారిపాలెం మండలం బండమీద కమ్మపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి, ప్రమీలమ్మ దంపతులు 30 ఏళ్ల కిందట జీవనోపాధి కోసం తిరుపతికి వలస వచ్చారు. కోలావీధిలోని చిన్నగుంట మోక్షిత నిలయంలో కాపురమున్నారు. ఇప్పుడు ప్రమీలమ్మ(53) స్థానికంగా పాచి పనులు చేసుకుంటుండగా.. గోపాల్‌రెడ్డి మేస్త్రీ పనిచేస్తూ పీపీ చావడి వీధిలోని ఇంట్లో ఉంటున్నాడు. అతడి భార్య ప్రమీలమ్మ చిన్న కుమార్తె రోజా వద్ద ఉంటోంది. రోజాకు తిరుపతికి చెందిన రవినాయక్‌కు ఇచ్చి రెండో వివాహం చేశారు. తిరుమలలో సుమో డ్రైవర్‌గా పనిచేస్తున్న రవినాయక్ తాగుడుకు అలవాటు పడ్డాడు. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టేవాడు. తన ఖర్చుల కోసం అత్త ప్రమీలమ్మ వద్ద ఉన్న డబ్బులు, నగలు ఇవ్వాలని శుక్రవారం డిమాండ్ చేశాడు. ఆమె నిరాకరించడంతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీనిపై రెచ్చిపోయిన రవినాయక్ ఆమె తలను పట్టుకుని ఇంట్లోని గోడకు బలంగా నాలుగైదు సార్లు మోదాడు. తలపై తీవ్రగాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రోజా ఫిర్యాదు మేరకు సీఐ మురళీ మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. నిందితుడికోసం ఎస్‌ఐ, తన సిబ్బందితో కలిసి తిరుమల, తిరుపతిలో గాలిస్తున్నారు.

నేడు జిల్లా జూడో జట్టు ఎంపిక

తిరుపతి(క్రీడలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో శనివారం జిలాస్థాయి జూడో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జూడో సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2005నుంచి 2010 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి ఉంటుందని, ఎంపికైన క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9059506346ను సంప్రదించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా మండలాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బోరుబావులు, చేతిపంపులు, గ్రామీణ నీటి సరఫరా పథకాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. అవసరమైతే ట్యాంకుల ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు పాల్గొన్నారు.


ఇంటర్ పరీక్షలకు 29,101 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు 29,101 మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పేపర్ -2ఎ, బోటనీ పేపర్ -2, సివిక్స్ పేపర్ -2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 29,698 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 597 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

భూ పరిహారంలో బినామీలు?

- రూ.కోట్లు కొట్టేసేందుకు పక్కా స్కెచ్

సత్యవేడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి చేపడుతున్న భూసేకరణలో ప్రభుత్వ భూములకు సంబంధించి పరిహారం కోసం బినామీ రైతుల పేర్లతో కొందరు దళారులు పక్కా స్కెచ్ వేసినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీరి వ్యవహారశైలి దీనికి బలం చేకూరుస్తోంది. గతేడాది అక్టోబరులో ఏపీఐఐసీ ద్వారా రెండు వేల ఎకరాల భూసేకరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం గ్రామాలలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ, పట్టా భూములను గుర్తించి ఏపీఐఐసీకి నివేదిక అందించారు. సత్యవేడు మండలం ఇరుగుళంలో 73 ఎకరాలు, కొల్లడంలో 69, పెద్దఈటిపాకంలో 53 ఎకరాల పట్టా భూములకు నోటిఫికేషన్‌నూ విడుదల చేశారు. మరోవైపు సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో మూడు రోజులుగా అవార్డెడ్ ఎంక్వైయిరీ (రికార్డుల పరిశీలన) ప్రారంభమైంది. కొల్లడం, పెద్దఈటిపాకం, చిన్నఈటిపాకం గ్రామాలలో ప్రత్యేక రెవెన్యూ అధికారులు భూసేకరణ కోసం ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని రైతుల రికార్డులను పరిశీలించారు. భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలతో పాటు, రైతు అనుభవంలో ఉన్న భూ విస్తీర్ణం, అనువంశికం, పన్ బీ, అడంగల్ తదితర రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. శ్రీసిటీ గ్రామాలకు చెందిన కొందరు.. ప్రభుత్వ భూముల పరిహారం జాబితాలో బినామీ పేర్లను చేర్చి అడ్డదారిలో లబ్ధిపొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇరుగుళం పంచాయతీ సర్వే నెంబర్ 162/1లో 3.82 ఎకరాలకు సంబంధించిన ప్రభుత్వ భూమిలో పరిహారం కోసం రైతులుగా ముగ్గురి పేర్లను జాబితాలో చేర్చారు. చిన్నఈటిపాకం పంచాయతీ సర్వే నెంబర్ 3బీ/1లో 3.88 ఎకరాలకు సంబంధించి మరో నలుగురి పేర్లను నోటిఫికేషన్‌లో చేర్చినట్లు సమాచారం. పరిహారం జాబితాలో ఇద్దరు మాజీ వలంటీర్ల పేర్లు ఉన్నట్లు ఆయా గ్రామాల్లో రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్న రెవెన్యూ అధికారులకు ఈ దళారులు సకల సదుపాయాలు సమకూరుస్తూ హల్‌చల్ చేయడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. భూ పరిహారం జాబితాలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, అంత వరకు ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లించవద్దని కోరుతూ ఆర్డీవో కిరణ్మయికి సీపీఎం నాయకులు దాసరి జనార్దన్, రమేష్ వినతిపత్రం సమర్పించారు.



భూ సేకరణ గ్రామాల్లో రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం

అధ్యక్షా..



ఎస్ఎస్ కెనాల్ పూర్తి చేయండి

సోమశిల-స్వర్ణముఖి కాలువ పనులు పూర్తయితే శ్రీకాళహస్తి నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది. అలాంటి కాలువను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. రూపాయి కూడా విడుదల చేయకుండా రైతులకు అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ కెనాల్‌ను పూర్తి చేయాలి. శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్ట, ఎన్టీఆర్‌నగర్, కైలాసగిరి ప్రాంతంలో సుమారు 40 ఏళ్ల నుంచి పదివేల కుటుంబాలకుపైగా ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నాయి. వారందరికీ ఎంజాయ్‌మెంట్ పట్టా మంజూరు చేస్తే ప్రయోజనం చేకూరుతుంది. ఇక, తిరుపతి రూరల్ మండలం ఓటేరు వద్ద రూ.900 కోట్ల విలువైన భూములను కబ్జా చేసేందుకు కొందరు వైసీపీనాయకులు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఓ నేతను ముందుపెట్టి వెనక నుంచి కొందరు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. గతంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు చొరవతో ఈ భూమి ఇప్పటికీ అన్యాక్రాంతం కాకుండా ఉంది. ఇప్పుడు ఆక్రమణలకు గురికాకుండా సంబంధిత మంత్రి చర్యలు తీసుకోవాలి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పనులు సకాలంలో పూర్తి కావాలంటే టైం లిమిట్ పెట్టాలి. జగనన్న కాలనీలకు భూములిచ్చిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేయగా, వెంటనే వేరే వారి ఖాతాలకు ఆ నగదు వెళ్లింది. దీనిపై విచారణ జరిపించాలి.

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే


ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జరిగితే

అధికారులదే బాధ్యత

- స్పష్టం చేసిన ఆర్డీవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చంద్రగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో ఎక్కడైనా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జరిగితే సంబంధిత రెవెన్యూ అధికారులదే బాధ్యతని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ స్పష్టంచేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందంటూ శుక్రవారం 'టాస్క్‌ఫోర్స్ ఏమైనట్లు?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినా ఎందుకు పనిచేయడంలేదని ఆగ్రహించారు. ఇకపై ఇలాంటివి జరిగితే వీఆర్వోలపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం పెట్టిందని, అంతేగానీ యంత్రాల ద్వారా తవ్వి, భారీ వాహనాల్లో సరిహద్దులు దాటించడం కాదన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. దీనిపై వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో మండిపడ్డారు.



చంద్రగిరి మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జ్యోత్స్న తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మార్చి పది నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దేవప్రసాదరాజుకు అమెరికా ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజుకు అమెరికా బోస్టన్‌లోని యునైటెడ్ సైంటిఫిక్ గ్రూప్ నుంచి ఆహ్వానం అందింది. నవంబరు 3వ తేదీ నుంచి చేపట్టే అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించాలని ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కిన్నెత్ బ్లమ్ ఆహ్వానం పంపారు. డెవలప్‌మెంట్ ఆఫ్ ఎర్బియం డోప్డ్ గ్లాస్ మెటీరియల్స్ ఫర్ సి-బాండ్ టెలీ కమ్యూనికేషన్స్ అంశంపై ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ప్రసంగించనున్నారు.

రాజీ పేరుతో చితకబాదారు

- ఎక్సైజ్ సీఐపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గొడవ విషయంలో రాజీపోవాలని తనను చావబాదారంటూ వాకాడు ఎక్సైజ్ సీఐపై కల్లుగీత కార్మికుడు ఉప్పల వెంకటేశులుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోట మండలం వెంకటపాళెం పంచాయతీ పరిధిలోని వీరారెడ్డిసత్రం గ్రామానికి చెందిన వెంకటేశులుగౌడ్.. తిన్నెలపూడి సమీపంలోని పొలాల్లో గల తాటిచెట్లకు కల్లు గీసుకుని జీవనం సాగిస్తున్నారు. రెండు వారాల కిందట కల్లు విక్రయాలు జరిపే విషయమై ఇతడికి మరో కార్మికుడు రాగయ్య మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో వీరిమధ్య రాజీ చేసేందుకు వచ్చిన ఎక్సైజ్ పోలీసులు తనను తీసుకెళ్లి చితకబాదారని వాకాడు ఎక్సైజ్ సీఐపై కోట పోలీసులకు వెంకటేశులు గౌడ్ ఫిర్యాదు చేశారు.

ఆచార్య వెన్నం ఉమ

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ

చదువు ఒక్కటే తానిచ్చే ఆస్తి అని బలంగా నమ్మే తండ్రి ప్రభావం ఆమెపై చెరగని ముద్ర వేసింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో చదువుకునేలా ప్రేరణ ఇచ్చింది. అందుకే ఆమె నాన్నే తన తొలి గురువు అని చెబుతారు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వెన్నం ఉమ. ఆది నుంచీ సామాజిక విషయాలపై ఉన్న ఆసక్తితో డిగ్రీలో సోషియల్ వర్క్ సబ్జెక్టును ఎంపిక చేసుకున్నారు. ఉన్నత విద్యా సంస్థలో చదివించాలనే కాంక్షతో 1983లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్‌లో ఎంఏ కోర్సు చదివారామె. బోధనతో ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకత్వం వహించే అవకాశం ఉంటుందని భావించారు. ఆదిశగానే కెరీర్‌ను ప్రారంభించారు. నాలుగు దశాబ్దాల పాటు యూనివర్సిటీ స్థాయిలో ప్రొఫెసర్‌గా పని చేసిన ఉమ వివిధ హోదాల్లో పనిచేశారు. పట్టుదల,నిండైన ఆత్మవిశ్వాసం ఆమెను పద్మావతి మహిళా వర్సిటీకి సారథిని చేశాయి.



"చదువుతో ఏమైనా సాధించవచ్చు. సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని పొందవచ్చు. ఏ రంగంలో ఉన్నా అంకిత భావం, సామాజిక బాధ్యత, నైతిక విలువలను మరవకూడదు. ఇవే అద్వితీయ శక్తులుగా తీర్చిదిద్దుతాయి. చదువు ఉద్యోగం కోసం మాత్రమే కాదని గుర్తించాలి. స్పష్టమైన లక్ష్యంతో, సంకల్పం బలంతో పనిచేయాలి. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఆదిశంకర కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న మనీషాఖోమేని

గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోట సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రాజావీధిలోని పలు ప్రైవేటు కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రూపవతి, బాలామణి, కీర్తన, సునీత, శివశంకర్, ప్రణయ్, సూర్య తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐటెక్ కంపెనీ హెచ్‌ఆర్ మనీషాఖోమేని, డాక్టర్లు కల్పన, పద్మావతి, విజయనిర్మల, సునీత, మధురమ్మ పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ నేరం



రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం నేరమని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం పోటుపాళెం కూడలి సమీపంలోని జాతీయరహదారిపై రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి



మంత్రి రామనారాయణరెడ్డి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. శుక్రవారం ఆయన మంత్రిని అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న దేవదాయల కమిటీలను రద్దు పరిచి వాటి స్థానంలో నూతన కమిటీలను త్వరగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధూపదీప నైవేద్యాలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరారు. చిల్లకూరు మండలం వేళ్లపాళెం గ్రామంలో ఉన్న మటభీమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కాగా అసెంబ్లీ సమావేశాలలో భాగంగా మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గూడూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరిటిపాళెం గ్రామ సమీపంలోని పంబలేరువాగులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు నలుపు, తెలుపు, పసుపు రంగు చారలు కలిగిన ఫుల్‌హ్యాండ్స్ చొక్కా ధరించి ఉన్నాడు. వయసు 35 వరకు ఉండవచ్చు.

ఎన్‌బీకేఆర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన

కోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈడీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. విశాఖపట్టణానికి చెందిన డీఎఫ్‌వో ఎస్‌ఎల్‌ఎన్ కుమార్, తిరుపతికి చెందిన ఇండస్ట్రియల్ ప్రమోషన్స్ ఆఫీసర్ అనిల్‌కుమార్ విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కల్పించారు. అదే విధంగా స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్టూడెంట్స్ చాప్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, దిలీప్ కుమార్ ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెళ్లకూరు, మార్చి 7 (ఆంధ్రజోతి) : మండలంలోని కొత్తూరు 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను గూడూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరో 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు సుబ్బరత్నమ్మ, సుబ్బరాజు, పెమ్మసాని పద్మలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 9మందికి స్వల్ప గాయాలయ్యాయి. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఎస్‌ఐ నాగరాజులు గాయపడిన వారిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


ధాన్యం లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

ఓజిలి, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం లోడు లారీకి విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఓజిలి నుంచి ధాన్యంతో ఓ లారీ బయలుదేరింది. పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డు వద్ద పైన వెళుతున్న విద్యుత్ వైర్లు ధాన్యం బస్తాలకు తగలడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. విద్యుత్ తీగల నుంచి మంటలు రేగాయి. విద్యుత్ సరఫరా ఆగిపోయింది. లారీ డ్రైవర్ పరారయ్యాడు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని విద్యుత్ స్తంభాన్ని తొలగించి యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరాను రాత్రి 9:30 గంటలకు పునరుద్ధరించారు. కాగా విద్యుత్ వైర్లు తెగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

విధులు అడ్డుకున్న 36మందికి జరిమాన

వెంకటగిరిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 2011లో రిజర్వు ఫారెస్టు భూముల్లో జాయింట్ సర్వే చేస్తున్న రెవెన్యూ, పోలీస్, ఫారెస్టు సిబ్బందిని అటకాయించి, పోలీసులు జీపునకు గాలి తీసేసి, అటవీ అధికారులు నాటిన మొక్కలు తొలగించిన యాతలూరు గ్రామానికి చెందిన 36 మందికి వెంకటగిరి జడ్జి పీ. అనుషా ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున రూ.10800 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారని సీఐ ఏవీ రమణ తెలిపారు. మొత్తం 41 మందిపై కేసు ఉండగా వారిలో ఐదుగురు మరణించారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు ఎస్‌ఐ అన్వర్‌బాషా చేశారని తెలిపారు.

ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయండి



సమావేశమైన టీడీపీ నాయకులు

దక్కిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు పిలుపునిచ్చారు. డక్కిలిలో తొలిసారి నిర్వహించ నున్న ప్రజాదర్బార్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దందవోలు రత్నాకరరెడ్డి, వెంకటరమణారెడ్డి, సునీల్ రెడ్డి, దండవోలు పెంచలరెడ్డి, పోకూరు రమేష్ నాయుడు, పీపీ చౌదిరి, సర్వేపల్లి రత్నయ్య, పల్లి శ్రీనివాసులు రెడ్డి, సునీల్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

12న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వివిధ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఈ నెల 12న మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని కమిషనర్ చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో బ్యాంక్ మేనేజర్లు పాల్గొంటారని వివరించారు.

నేడు ఫాగింగ్ మిషన్ ప్రారంభం

నాయుడుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో దోమల నివారణకు నూతనంగా కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా శనివారం ప్రారంభించ నున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రజలుల్లా తెలిపారు. స్వర్ణముఖి నదిలో ఉన్న మున్సిపాలిటీ వాహనాల షెడ్ వద్ద వాహనాల సర్వీసుల కోసం వాష్‌మిషన్‌ను కూడా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద మున్సిపల్ నూతన కార్యాలయ భవనానికి ప్రభుత్వం కేటాయించిన భూమిని ఎమ్మెల్యే పరిశీలించనున్నారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనుల నేపథ్యంలో శనివారం పలు రైళ్లను సదరన్ రైల్వే అధికారులు రద్దుచేశారు. తమిళనాడు రాష్ట్రం కవర్‌పేట- పొన్నేరిల మధ్య రైళ్ల పట్టాల మార్పిడి వంటి ఇంజనీరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి ఆ పనులు తిరిగి మొదలుకానున్నాయి. దీంతో చెన్నై-సూళ్లూరుపేట మధ్య కొన్ని రైళ్ల రాకపోకలను నిలిపివేసింది. అందులో చెన్నై -సూళ్లూరుపేట- చెన్నై మధ్య నడిచే సబర్బన్ రైళ్లు పూర్తిగా రద్దు కాగా చెన్నైలో ఉదయం 5:40 గంటకు నెల్లూరుకు వెళ్లే ట్రైన్ నంబరు 66029 మెమో రైలు, అలాగే నెల్లూరు నుంచి ఉదయం 10: 20 గంటలకు చెన్నైకు వెళ్లే ట్రైన్ నంబరు 66030 మెమో రైలు శనివారం పూర్తిగా రద్దుచేశారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లించవచ్చు



కమిషనర్ చిన్నయ్య

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం పూర్తికానున్న నేపథ్యంలో సూళ్లూరుపేట మున్సి పాలిటీలో ప్రజల సౌకర్యార్థం సెలవు రోజులైన శని, ఆది వారం కూడా కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చునని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య శుక్రవారం తెలి పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మసీదు ముందు ముస్లింల నిరసన

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటలో ఉన్న జామియా మసీదు కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని ముస్లిం సోదరులు శుక్రవారం మసీదు ముందు ప్లకార్డులు పట్టుకొని నిరసన చేశారు. వక్ఫ్‌బోర్డు ముతవల్లీ పనితీరు బాగలేదని ఎమ్మెల్యే చొరవ తీసుకుని కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలీ, మున్నా, హఫీజ్, పజాతుల్లా, డాహీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు



బాల్‌తో గ్లాసులను కొడుతున్న మహిళలు

వెంకటగిరిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, కౌన్సిలర్ దొంతు శారద, మహిళలు పాల్గొన్నారు. ● మున్సిపల్ చైర్‌పర్సన్ విశ్వోదయ జూనియర్ కళాశాలల్లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

వివాహిత ఆత్మహత్య

కోట, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఆరునెలల క్రితమే ఆమెకు వివాహమైంది. కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరేసుకుని చనిపోయింది. కోట పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

కొత్తపట్నంలో క్యాన్సర్ పరీక్షలు

కోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం సచివాలయం వద్ద శుక్రవారం స్థానికులకు ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగాయి. స్విమ్స్ ఆధ్వర్యంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా వైద్య పరీక్షలు జరిగాయి. ఉచితంగా మందులు పంపిణీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

● రూ. 4.30 కోట్లతో కమ్మవారిపాళెం రోడ్డు నిర్మాణపనులు ● రూ. 1.95 కోట్లతో చిగురుపాడు రోడ్డు నిర్మాణపనులు





ఎక్స్‌కవేటర్‌తో చేపడుతున్న కమ్మవారిపాళెం రోడ్డు నిర్మాణ పనులు, రోడ్డురోలర్‌తో చేపట్టి చిగురుపాడు రోడ్డు నిర్మాణ పనులు

నాయుడుపేట టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో దశాబ్దాల కల నెరవేరింది. గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ పట్టింది. మట్టిరోడ్లు... గ్రావెల్ రోడ్లకే పరిమితమైన రహదారులు నేడు తారు(బీటీ) రోడ్లతో కళకళలాడనున్నాయి. రూ. 6.25 కోట్ల (ఎంజీఎన్‌ఆర్‌ఈజీస్) నిధులతో తారు రోడ్లు వేయడానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రూ.4.30 కోట్లతో కమ్మవారిపాళెంకు తారు రోడ్డు వేస్తున్నారు. జాతీయ రహదారికి సమీపంలోని విన్నమాల గ్రామం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కమ్మవారిపాళెం గ్రామం ఉంది. ఆ గ్రామానికి దశాబ్దాలుగా తారు రోడ్డు లేదు. గుంతలమయంగా మారిన గ్రావెల్ రోడ్డులోనే ప్రజలు ఇంతకాలం రాకపోకలు సాగిస్తూ వచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల సమయంలో నెలవల విజయశ్రీ ప్రచారానికి కమ్మవారిపాళెం వెళ్లారు. ఆ సమయంలో తాను గెలిచిన వెంటనే రోడ్డు వేయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి రోడ్ల సమస్యను తీసుకెళ్లారు. కమ్మవారిపాళెం, చిగురుపాడు గ్రామాల పరిస్థితిని తెలియజేశారు. రూ.6.25 కోట్లను మంజూరు చేయించారు. రూ.4.30 కోట్లతో కమ్మవారిపాళెంకు, రూ.1.95 కోట్లుతో చిగురుపాడుకు తారురోడ్డు పనులు కొనసాగుతున్నాయి. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఎందుకో.. ఏమో.. రూటు మారిన బస్సు..!

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో ఉండేది సూళ్లూరుపేటలో.. బస్సు సర్వీసు నడిచేది సూళ్లూరుపేట-తిరుపతి మార్గంలో.. అయితే ఆ బస్సును ప్రారంభించేది మాత్రం నాయుడుపేటలో. ఇలా ఎందుకు చేస్తున్నారో ఏమో తెలియక స్థానిక నాయకులు, ఆర్టీసీ సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకు కొత్త బస్సులు మూడు వచ్చాయి. ఇందులో ఒక బస్సుకు పర్మిట్, రిజిస్ట్రేషన్ వచ్చింది. ఆ బస్సు సూళ్లూరుపేట-తిరుపతి మార్గంలో నడిపేందుకు రూట్ పర్మిట్ వచ్చింది. అయితే ఆ బస్సును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా నాయుడుపేటలో ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జున ప్రకటన చేశారు. ఇక్కడ డిపో ఉండగా నాయుడుపేటలో ప్రారంభించడం ఏమిటని ప్రజలతో పాటు స్థానిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై డిపోలో పనిచేసే సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సూళ్లూరుపేట బస్టాండులోనే బస్సును ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబుల ఘర్షణ..ఒకరికి గాయాలు



గాయపడ్డ ముని

తడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ మందుల బాబుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. తడ శ్రీకాళహస్తి రోడ్డులో ఉన్న మద్యం షాపులో వరదయ్యపాళెం మండలం పులియాలం గ్రామానికి చెందిన ముని మద్యం సేవించడానికి వచ్చాడు. అదే మండలం కారిపాకం గ్రామానికి వినోద్ కూడా అక్కడకు వచ్చాడు. ఎదురెదురుగా కూర్చొని మద్యం తాగారు. పక్కపక్క ఊర్లకు చెందినవారు కావడంతో మాటమాట కలిసింది. కొంతసేపటి తరువాత ఆ మాటలు ఇరువురి మధ్య ఘర్షణకు దారితీశాయి. ఇద్దరూ గొడవకు దిగారు. మద్యం మత్తులో ఉన్న వినోద్ బీరు బాటిళ్లతో ముని తలపై దాడిచేసి పరారయ్యాడు. గాయపడిన మునిని స్థానికులు ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా మద్యం షాపుల నిర్వాహకులు గదులు అద్దెకు తీసుకుని బార్లను తలపించేలా నడుపుతున్నారు. షాపుల వద్దే మద్యం సేవించడం వల్ల తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు

తడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శుక్రవారం తడ పోలీస్ స్టేషన్‌కు సాధారణ తనిఖీలో భాగంగా విచ్చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నాయుడుపేట, సూళ్లూరుపేట, తడల్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా వాహనదారులు అతివేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకో నున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రధాన కూడళ్లలో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలపరాదని వాహనదారులు ట్రాఫిక్ నియమావళిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. మాంబట్టు సెజ్‌రోడ్డులో కొండూరు చెరువులో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని ఇందుకోసం ఒడిశాకు సైతం పోలీసులను పంపామని వివరించారు. ఆయనవెంట తడ ఎస్‌ఐ కొండప నాయుడు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలోనూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని ఈఈ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన సూళ్లూరుపేట విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం సామర్థ్యం పెంచుకొంటే 50 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ శేఖర్, ఏఈలు పూర్ణిమ, మోహిని, మురళి సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారు పోలూరు న్యూకాలనీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీఈఈ శేఖర్, ఏఈ మోహిని ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. కొంత కాలంగా లోఓల్టేజ్ సమస్య ఉండడంతో కాలనీవాసులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా సాధికార ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శంకర్‌శర్మ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం మన సంప్ర దాయమని నేడు పురు షులకు దీటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణి స్తున్నారన్నారు. ముందుగా విద్యార్థులు, మహిళా అధ్యాపకులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్య క్రమంలో ఉప ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, మహిళా సాధికార విభాగ కన్వీనర్ ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెళ్లకూరు, మార్చి 7 (ఆంధ్రజోతి) : ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఈవో డీ శాంతకుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై పలు సబ్జెక్ట్‌ల్లో ప్రశ్నలు వేసి సమాధాలు రాబట్టారు. ప్రధానోపాధ్యాయులు మునిశేఖర్ ఉన్నారు.

మందుబాబుల అడ్డాగా పేట బస్టాండు



ఆర్టీసీ బస్టాండు నుంచి మందుబాబును పంపిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండులో మందుబాబుల బెడద అధికంగా ఉంది. ప్రతిరోజూ మద్యం సేవించి మందుబాబులు అక్కడకు చేరుకొని అక్కడి ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. తమిళనాడుకు సరిహద్దు కావడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో రాత్రి 11 గంటల వరకు కూడా జనసంచారం ఉంటుంది. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండులో రాత్రి 7:30 గంటలు అయ్యిందంటే ఆర్టీసీ అధికారులు ఎవరూ కనబడరు. కంట్రోల్ పాయింట్ ఉన్న మూసేసి వెళ్తున్నారు. దీంతో రాత్రి అయితే మందు బాబులకు బస్టాండు అడ్డాగా మారిపోతోంది. దీంతో బస్టాండుకు వచ్చే మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం రాత్రి ఓ మందుబాబు తప్పతాగి బస్టాండులో దుస్తులు విప్పేసి బూతులు మాట్లాడుతూ హల్‌చల్ చేస్తూ కనిపించాడు. అక్కడున్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి మందుబాబును అక్కడ నుంచి పంపిం చేశారు. కంట్రోల్ పాయింట్‌లో కనీసం రాత్రి 10 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసు కోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.